ముద్ర

సమగ్ర సమాచార పత్రిక

www.mudranews.in | @mudranews

హైదరాబాద్
సోమవారం, 19.10.2026

సంపుటి:13 సంచిక: 349
పేజీలు: 08 వెల: రూ. 5



పాఠకులకు, ప్రకటన కర్తలకు, ఏజెంట్లకు

విజయదశమి శుభాకాంక్షలు

నేడు దసరా సందర్భంగా

కార్యాలయానికి సెలవు

పునర్దర్శనం గురువారం

మంత్రి, పీసీసీ చీఫ్, ఎంపీకి

లీగల్ నోటీసులు

కేసీఆర్‌పై తప్పుడు ప్రచారం..

- ఫామ్‌హౌస్‌కు నీళ్ల మళ్లింపు ఆరోపణలు
- న్యాయపోరుకు బీఆర్ఎస్ సిద్ధం
- సోషల్ మీడియా పోస్టులు తొలగించాలి
- నోటీసులకు స్పందించకపోతే పరువు నష్టం దావా
- బీఆర్ఎస్ హెచ్చరిక

02

యుగయుగాల విజయపర్వం

విజయదశమి విశిష్టత

- చెడుపై మంచి విజయం.. దసరా వెనుక ఆసక్తికరమైన కథలెన్నో!
- కృతయుగం నుంచి కలియుగం వరకు.. దసరా చరిత్ర
- మహిషాసుర మర్దనం నుంచి రావణ సంహారం వరకు..
- విజయదశమి వెనుక పురాణ గాథలు!
- హిందువులకే కాదు.. బౌద్ధులు, జైనులు, సిక్కులకూ విజయదశమి ప్రత్యేకమే
- జమ్మి పూజ నుంచి రావణ దహనం వరకు

02

మైసూరు నుంచి ఇండోనేషియా వరకు సంబరాలు!

ఫ్యూచర్ సిటీపై రేవంత్ ఫోకస్

అభివృద్ధి పనులపై స్పెషల్ రివ్యూ!

పోలీస్ కమిషనరేట్ ప్రారంభం..



- యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ సందర్శన
- డిసెంబరులో ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమిట్.. ఏర్పాట్లపై సమీక్ష
- కుర్మిద్దలో నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అర్బన్ మేనేజ్‌మెంట్‌కు శంకుస్థాపన
- పెట్టుబడులు, నైపుణ్యాభివృద్ధి, ఆధునిక మౌలిక వసతులే లక్ష్యంగా ముందడుగు

ముద్ర, హైదరాబాద్:
తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి కొత్త దిశానిర్దేశం చేసేలా ఫ్యూచర్ సిటీ నిర్మాణం, అభివృద్ధి కార్యక్రమాలపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోంది. భవిష్యత్తులో పారిశ్రామిక, ఆర్థిక, సాంకేతిక రంగాలకు కీలక కేంద్రంగా ఫ్యూచర్ సిటీని తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ప్రభుత్వం అడుగులు వేగవంతం చేస్తోంది. ఇందులో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోమవారం ఫ్యూచర్ సిటీ పరిధిలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. నూతన పోలీస్ కమిషనరేట్ కార్యాలయ ప్రారంభం, యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ సందర్శన, గ్లోబల్ సమిట్ ఏర్పాట్ల సమీక్ష, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అర్బన్ మేనేజ్‌మెంట్‌కు శంకుస్థాపనతో పాటు వివిధ అభివృద్ధి ప్రాజెక్టుల పురోగతిని పరిశీలించనున్నారు.

పోలీస్ కమిషనరేట్ ప్రారంభోత్సవం

ఫ్యూచర్ సిటీ పరిధిలో శాంతిభద్రతల నిర్వహణ, పోలీసు వ్యవస్థను మరింత బలోపేతం చేసే దిశగా ఇబ్రహీంపట్నంలో నూతన పోలీస్ కమిషనరేట్ కార్యాలయ భవనాన్ని సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించనున్నారు. కొత్త కార్యాలయం అందుబాటులోకి రావడంతో పోలీసు పరిపాలన, సమన్వయం, ప్రజలకు పోలీసు సేవలు అందించే వ్యవస్థకు అవసరమైన మౌలిక వసతులు మరింత మెరుగుపడే అవకాశం ఉంది. వేగంగా విస్తరిస్తున్న పట్టణ ప్రాంతాలు, పారిశ్రామిక జోన్లు, భవిష్యత్తులో ఏర్పడే నివాస ప్రాంతాల అవసరాలకు అనుగుణంగా శాంతిభద్రతల వ్యవస్థను బలోపేతం చేయడం కీలకంగా మారనుంది. కమిషనరేట్ ప్రారంభోత్సవానికి ప్రాధాన్యం ఏర్పడింది. **మిగతా 02లో**



- హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో 75 మంది బదిలీ
- లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్, క్రైమ్ విభాగాల్లో పనిచేస్తున్న వారికి స్థానచలనం
- బదిలీ అయిన వారు వెంటనే విధుల్లో చేరాలని సీపీ సజ్జనార్ ఆదేశం
- ఒకేచోట ఎక్కువకాలం పనిచేస్తున్న వారిని బదిలీ

పోలీసుశాఖలో ప్రక్షాళన


హైదరాబాద్ 02

పోలీసు శాఖలో మార్పులు..

పండగల సీజన్‌ను దృష్టిలో ఉంచుకొని పాలనాపరమైన మార్పులు

కేసీఆర్ సోషల్ ఇంజనీరింగ్ స్కెచ్!

పట్టభద్రుల ఎమ్మెల్సీ పోరులో మాస్టర్ కాండిడేట్స్ కోసం వేట!



- టికెట్ ఖరారులో సామాజిక సమీకరణాలే కీలకం
- అంగబలం, అర్థబలం ఉన్న నేతలపై గులాబీ బాస్ ఫోకస్
- కాంగ్రెస్ ముందస్తు వ్యూహానికి చెక్ పెట్టేలా బీఆర్ఎస్ కసరత్తు
- అభ్యర్థుల ప్రకటనపై ఉత్కంఠ

ముద్ర, తెలంగాణ బ్యూరో:
తెలంగాణలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల పోరు వేడెక్కుతోంది. మహబూబ్‌నగర్–రంగారెడ్డి–హైదరాబాద్, నల్గొండ –ఖమ్మం–వరంగల్ నియోజకవర్గాలపై ప్రధాన రాజకీయ పార్టీలు ప్రత్యేక దృష్టి సారించాయి. ఈ ఎన్నికల్లో సత్తా చాటేందుకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సోషల్ ఇంజనీరింగ్ వ్యూహానికి పదును పెడుతున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది. సామాజిక సమీకరణాలతో పాటు వ్యక్తిగత ఇమేజ్, ఆర్థిక బలం, కేడర్‌పై పట్టు ఉన్న నేతలను బరిలోకి దించేందుకు కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది.

కాంగ్రెస్ ముందంజ.. విపక్షాల్లో ఉత్కంఠ!

పట్టభద్రుల ఓటర్ల నమోదును కాంగ్రెస్ ప్రతిష్టాత్మకంగా తీసుకోగా, బీఆర్ఎస్, బీజేపీ అభ్యర్థుల ఎంపికపై వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నాయి. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల ఫలితాల తర్వాత విద్యావంతులు, ఉద్యోగులు, నిరుద్యోగుల్లో పార్టీపై ఉన్న అభిప్రాయాన్ని మార్చుకోవడానికి ఎన్నికలను బీఆర్ఎస్ అవకాశంగా భావిస్తున్నట్లు సమాచారం.

అంగబలం.. అర్థబలం.. జనబలం!

విస్తృత పరిధిలో ఉండే పట్టభద్రుల నియోజకవర్గాల్లో ప్రచారం నిర్వహించడం అంత సులభం కాదు. అందుకే పార్టీకి విధేయులైన నేతలతో పాటు వ్యక్తిగత పరిచయాలు, విస్తృత అనుచరగణం, ప్రచారాన్ని ముందుకు తీసుకెళ్లే సామర్థ్యం ఉన్నవారికే ప్రాధాన్యం ఇవ్వాలనే ఆలోచనలో గులాబీ నాయకత్వం ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. సామాజిక వర్గాల సమతుల్యతను పాటిస్తూ గెలుపు అవకాశాలను బేరీజు వేస్తున్నట్లు తెలుస్తోంది.

నిరుద్యోగమే ప్రధాన అస్త్రాలు!

మరోవైపు కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యోగ నియామకాలు, సంక్షేమ పథకాలు, **మిగతా 02లో**

అభ్యర్థులపై ఫిర్యాదు చేయొచ్చు

ఓటర్లు, సాధారణ పౌరుడికి ఆ హక్కు ఉంది

- ఆఫీసర్లే కంప్లైంట్ చేయాలన్న రూల్ ఏమీ లేదు
- తప్పుడు అఫిడవిట్లపై సుప్రీం కీలక తీర్పు
- తప్పుడు వివరాలు ఇచ్చారంటూ పిటిషన్



06

కాంగ్రెస్‌కు కేంద్రం షాక్

ఖర్గే లేఖకు రిజిజు కౌంటర్!

- మళ్లీ చర్చలెందుకు? కాంగ్రెస్ తీరుపై కేంద్రం అసహనం
- డీఎంకే నుంచి వైఎస్సార్‌సీపీ వరకు.. పార్టీలతో కేంద్రం చర్చలు
- డీలిమిటేషన్‌పై రాజకీయ వేడి
- కీలక బిల్లులకు అడ్డుపడొద్దు.. కాంగ్రెస్‌కు రిజిజు సూచన



06

అభిజీత్ దీప్కే ఏమోషనల్

ప్రజల కోసం పోరాడి జైలుకు..

- ఎవరి బలవంతం లేకుండానే ఉద్యమంలోకి
- సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే
- అశుతోష్ రాంకా, సౌరవ్ దాస్ అరెస్టుపై ఎమోషనల్ పోస్టు



06

వైకాపా నేతలు ఉన్మాదుల్లా వ్యవహరిస్తున్నారు

సీఎం చంద్రబాబు



02

- ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయలేదు
- సంక్షేమానికి రూ.1.5 లక్షల కోట్లు ఖర్చు
- స్థానిక సంస్థల బలోపేతమే నిజమైన వికేంద్రీకరణ
- రాయలసీమను రతనాల సీమగా మారుస్తాం

ఏపీలో స్థానిక సమరం

జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల

- నవంబర్ 3న పోలింగ్, నవంబర్ 5న ఓట్ల లెక్కింపు, ఫలితాల వెల్లడి
- మొత్తం 659 జెడ్పీటీసీ, 9829 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు
- అక్టోబర్ 21 నుంచి 23 వరకు నామినేషన్ల స్వీకరణ
- జెడ్పీటీసీ అభ్యర్థికి రూ.8 లక్షలు, ఎంపీటీసీకి రూ.4 లక్షల ప్రచార ఖర్చు పరిమితి



02

ఇదీ AI ముద్ర



సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
www.mudranews.in | @mudranews
మంగళవారం, 20 అక్టోబర్, 2026
2
జనరల్ న్యూస్
General NEWS

దసరా రోజు గుమ్మడికాయ ఎందుకు కొడతారు?

విజయదశమి రోజున ఇళ్ల ముందు, దుకాణాల వద్ద గుమ్మడి కాయ కొట్టడం చాలా ప్రాంతాల్లో ఆనవాయితీగా కొనసాగుతోంది. ఇలా చేయడం వల్ల నరదృష్టి తొలగిపోయి, ఇంట్లో సుఖసంతోషాలు, విజయాలు కలుగుతాయని ప్రజలు నమ్ముతారు. తరతరాలుగా ఈ ఆచారం కొనసాగుతోంది.



యుగయుగాల విజయపర్వం



ముద్ర, తెలంగాణ బ్యూరో :
అత్యంత ప్రాచీన కాలంలో దసరా కేవలం ఒక మతపరమైన పండగలా కాకుండా ప్రకృతి ఆరాధనగా మహావీరుల పరాక్రమ ప్రదర్శనగా, రాజ్యాల దిగ్విజయ యాత్రలకు శుభారంభ సూచికగా జరుగుతూ వచ్చింది. ప్రాచీన గ్రంథాల ప్రకారం చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా విజయదశమి పర్వదినాన్ని దేశవిదేశాలలో జరుపుకొంటున్నాము. ప్రాచీన మధ్య యుగాలలో భారత దేశాన్ని పరిపాలించిన రాజులు దసరాను అత్యంత వైభవంగా, అధికారికంగా నిర్వహించేవారు. విజయనగర సామ్రాజ్యం దక్షిణ భారత దేశంలో దసరా వేడుకలకు పెట్టింది పేరు. రాయల కాలంలో 'మహా నవమి దిబ్బ' కేంద్రంగా పది రోజులపాటు దసరావేడుకలు అంబరాన్నంటేలా జరిగేవని చరిత్ర చెబుతోంది. ఆ కాలంలో ఏనుగుల ప్రదర్శనలు, మల్లయుద్ధాలు, సాంస్కృతిక ప్రదర్శనలు అద్భుతంగా ఉండేవని పర్షియన్ రాయబారి అబ్దుల్ రజాక్ వంటి విదేశీ యాత్రికులు తమ రచనల్లో చెప్పారు. విజయనగరరాజుల సంప్రదాయాన్ని కొనసాగిస్తూ క్రీ. శ. 1610లో రాజా వొడయార్ శ్రీరంగ పట్నంలో మైసూరు దసరా ఉత్సవాలను ప్రారంభించారు. ప్రాచీనకాలం నాటి ఆ రాజసం నేటికీ చాముండేశ్వరీదేవి ఊరేగింపులో మనకు కనువిందు కలిగిస్తోంది.

కృతయుగంలో...
కృతయుగం(సత్య యుగం), త్రేతాయుగం, ద్వాపర యుగాలు గడచి, నేటి కలియుగంలో దసరా మహోత్సవాలు వైభవోపేతంగా జరుగుతున్నాయి. మన దేశంలోనూ, ప్రపంచంలోని పలు దేశాల్లోనూ కన్నుల పండుగగా జరగడం మనం చూస్తున్నాం. కృతయుగంలో మహిషాసురుడనే మహారాక్షసుడు తన ఘోర తపోఫలంగా బ్రహ్మదేవుడు తనకిచ్చిన వరాలతో మదమెక్కి దేవతల్ని, మునులను పీడించేవాడు. అతడిని అంతం చేయడానికి బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు, ముక్కోటి దేవతల శక్తులన్నీ ఏకమై, ఒకే ఒక మహాశక్తి దుర్గగా అవతరించింది. ఆ అమ్మవారే ఆశ్వీయు జశుద్ధ పాడ్యమినుండి తొమ్మిది రాత్రులు మహిషాసురుడితో భీకరమైన యుద్ధం చేసి, ఆశ్వీయుజ శుద్ధ దశమి నాటి ఉదయం మహిషాసురుడిని వధించి ముల్లోకాలకు శాంతిని చేకూర్చింది. విజయాన్ని తెచ్చిన పదవరోజున పండగ చేసుకోవడం కృతయుగం నుంచే ప్రారంభమైంది.

త్రేతాయుగంలో...
త్రేతాయుగంలో శ్రీరామచంద్రుడు మహాపరాక్రమవంతుడైన రావణాసురుడిని సంహరించడానికి సంకల్పించాడు. లంకానగరంలో ఉన్న సీతాదేవి ని రక్షించడానికి శ్రీరాముడు లక్ష్మణ సమేతంగా వానర సైన్యంతో కలిసి వెళ్లి, రావణాసురుడిపై యుద్ధాన్ని ప్రకటించాడు. లంకపై దాడిచేయడానికి ముందుగా శ్రీరాముడు దేవీ నవరాత్రులు దీక్షను ఆచరించి దుర్గాదేవి అనుగ్రహాన్ని పొందా డని పురాణాలు చెబుతాయి. ఆ యుగంలో శ్రీరాముడు రావణాసురుని సంహరించి విజయాన్ని సాధించింది విజయదశమి నాడేనని రామాయణం చెబుతోంది. అందుకే ఈ రోజును చెడుపై మంచి సాధించిన విజయానికి గుర్తుగా ఉత్తరభారత దేశం లో 'రామలీలా 'ఉత్సవాలను అనందోత్సాహాలతో నిర్వహించి, రావణాసురుని దిష్టి బొమ్మ'లను దహనం చేస్తారు. ద్వాపర యుగంలో.. ద్వాపరయుగంలో పాండవులు తమ 12 ఏళ్ళ వనవాసం, ఒక ఏడాది అజ్ఞాతవాసం ముగించుకొని శమీ వృక్షం (జమ్మిచెట్టు) పైన దాచివుంచిన తమ ఆయుధాలను తిరిగి తీసుకొన్న రోజు కూడా విజయదశమే. ఆయుధాలను ధరించి వారు విజయాన్ని సాధించారు. దసరానాడు శమీపూజ, ఆయుధపూజ ఆచారం అప్పటి నుంచీ స్థిరపడింది. మహాభారత ఘట్టం ప్రకారం దసరా పండగల్లో అలాయుధ పూజ, జమ్మిచెట్టుకు ప్రదక్షిణ అంతర్భాగమయ్యాయి.

బౌద్ధులకు...
విజయ దశమి బౌద్ధులకు అత్యంత పవిత్రమైన రోజు. దీనిని ఆ మతస్తులు 'అశోక విజయ దశమి'గా పాటిస్తారు. కళింగయుద్ధంలో జరిగిన రక్తపాతాన్ని కళ్లారా చూసిన మౌర్య చక్రవర్తి అశోకుడు ఆ తరువాత జీవితంలో శాంతిమార్గాన్ని ఎంచుకొని విజయదశమి పర్వదినంనాడే బౌద్ధమతాన్ని స్వీకరించాడు. అది చరిత్ర. దేశంలోని అన్ని ప్రాంతాల్లో, ముఖ్యంగా మహారాష్ట్రలో నివసించే బౌద్ధమతస్తులు ఈ రోజును 'ధమ్మ చక్ర ప్రవర్తన్ దివస్'గా లేదా 'అశోక విజయ దశమి'గా ఉత్సవం చేసుకుంటారు. పెద్ద ఎత్తున ప్రదర్శనలు నిర్వహిస్తారు. ప్రార్థనలు చేస్తారు.

సిక్కులకు...
సిక్కుల పదవ గురువైన గురు గోవింద్ సింగ్ జీ దసరా పండుగకు గల 'చెడుపై మంచి సాధించిన విజయ' మనే భావనను గౌరవించారు. జలూమ్ (అన్యాయం)పై పోరాడటానికి ఆయన దసరా పర్వదినాన్ని అందరికీ శక్తినీ, ధైర్యాన్ని ప్రదర్శించే రోజుగా ఎంచుకున్నారు.

జైనులు కూడా...
జైన రామాయణం ప్రకారం 'జైన పద్మపురాణం'లో శ్రీరామచంద్రమూర్తిని ఎనిమిదవ బలదేవుడిగా కీర్తిస్తూ, ఆయన రావణుడిపై సాధించిన విజయాన్ని సాధించిన రోజుగా విజయోత్సవం జరుపుకుంటారు. జైనులు ఈ పర్వదినం నాడు శాంతినీ, అహింసను ప్రబోధిస్తూ ప్రత్యేక పూజలు, అర్చనలు చేస్తారు.
ముస్లింలు, క్రైస్తవులు ఈ పండుగను మత పరంగా జరుపుకోకపోయినా, భారతదేశంలో శతాబ్దాలుగా వున్న సహజీవన సంస్కృతి దృష్ట్యా, ఈ మహోత్సవాల్లో భాగస్వాములౌతారు. ఉత్తర భారత దేశంలో 'రాము లీల' నాటకాలకోసం ముస్లిం కళాకారులు రావణుడి కుష్మాండాలను తయారు చేయడం, నాటకాలలో పాత్రలు వేయడం తరతరాలుగా కొనసాగుతోంది.

మైసూరులో అందరికీ...
అంతర్జాతీయ ఖ్యాతిని ఆర్జించిన మైసూర్ దసరా మహోత్సవాలను, హిమాచల్ ప్రదేశ్‌కు చెందిన 'కులు' దసరా ఉత్సవాలను ఒక మత పరమైన పండగలాగా కుండా, రాష్ట్రసాంస్కృతిక ఉత్సవాలు(స్టేట్ ఫెస్టివల్)గా నిర్వహిస్తున్నారు. వీటిలో అన్నిమతాల ప్రజలు ఊరేగింపులు చూస్తూ, ఉత్సవ ప్రదర్శనలలో పాల్గొంటూ ఆనందిస్తారు. వివిధ దేశాల్లో ఈ పండుగను అనేకరీతుల్లో జరుపుకొంటున్నారు. ఇండోనేషియాలోని బాలి, జావా ద్వీపాల్లో దసరా పండగ సంస్కృతి సర్వత్రా కనిపిస్తుంది. విజయదశమి రోజుల్లో రామాయణ గాధనుప్రతిబింబించే అద్భుతమైన షాడో పప్పెట్రీ (తోలు బొమ్మ లాటలు), సాంప్రదాయ రామాయణ నృత్యనాటకాలను ప్రదర్శిస్తారు. కరేబియన్ దేశాలని పిలవబడే ట్రినిడాడ్, గయానా, సరినామ్ దేశాల్లో శతాబ్దాల క్రితమే స్థిరపడిన హిందూ సంతతి వారు దసరా సంస్కృతిని కాపాడుకుంటూ వైభవంగా జరుపుకుంటున్నారు. ఉత్తర భారతదేశాన్ని పోలి ఉండేలా వీరు బహిరంగ ప్రదేశాల్లో 'రామ్ లీలా' నాటకాలను ప్రదర్శిస్తారు. పండగ చివరి రోజున భారీ ఎత్తున రావణాసురుని 'కుష్మో బొమ్మను' తయారు చేసి దహనం చేస్తారు.
ఇండోనేషియాలో తెల్లటి వస్త్రం వెనుక లైట్ వేసి, ఆ కాంతిలో తోలు బొమ్మల నీడలు తెర పై కనిపించేలా ప్రదర్శిస్తారు. ఈ ప్రదర్శనను నిర్వహించే కళాకారుడిని దలాంగ్ అంటారు. అతనొక్కడే వందలాది పాత్రలకు వేర్వేరు గొంతులతో హాస్యభరితంగా డైలాగులు చెబుతూ కథను రక్తి కట్టిస్తాడు. ఈ రామాయణ ప్రదర్శన జరుగుతున్నంతసేపూ వెనుక నుంచి 'గమేలాన్' అనే ఇండోనేషియా సంప్రదాయ సంగీతవాద్యబందం ఉద్వేగంతో సంగీతాన్ని వినిపిస్తూ వుంటుంది. శ్రీరాముని జననం, సీతాపహరణం, హనుమంతుని లంకా దహనం, రావణ సంహారం వంటి రామాయణ కీలక ఘట్టాలను ఇండోనేషియా స్థానిక సంస్కృతి, హాస్యపాత్రలతో రాత్రంతా (సెమార్, గారాంగ్ మొదలైనవి) మిళితం చేసి ప్రదర్శిస్తారు.

ఫ్యూచర్ సిటీపై సీఎం రేవంత్ ఫోకస్..



(మొదటి పేజీ తరువాయి)
యువతకు ఉపాధి అవకాశాలను పెంచడం, పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలతో కూడిన మానవ వనరులను తయారు చేయడం లక్ష్యంగా ఏర్పాటు చేస్తున్న యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీని ముఖ్యమంత్రి సందర్శించనున్నారు. యూనివర్సిటీలో చేపడుతున్న ఏర్పాట్లు, మౌలిక వసతులు, శిక్షణ కార్యక్రమాల పురోగతిని పరిశీలించనున్నారు. మారుతున్న పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా యువతకు నైపుణ్య శిక్షణ అందించడం, విద్యకు ఉపాధికి మధ్య ఉన్న అంతరాన్ని తగ్గించడం ఈ తరహా సంస్థల ప్రధాన లక్ష్యంగా ఉండనుంది. ఫ్యూచర్ సిటీ పరిధిలో భవిష్యత్తులో ఏర్పడే పరిశ్రమలు, సంస్థలకు అవసరమైన నైపుణ్యాలు కలిగిన యువతను సిద్ధం చేయడంలో ఈ యూనివర్సిటీ కీలక పాత్ర పోషించే అవకాశం ఉంది.

గ్లోబల్ సమిట్ ఏర్పాట్లపై సమీక్ష
తెలంగాణకు దేశీయ, అంతర్జాతీయ పెట్టుబడులను ఆకర్షించేందుకు డిసెంబరులో నిర్వహించనున్న 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమిట్'పై ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారిస్తోంది. ఈ సమిట్ ఏర్పాట్లపై సీఎం రేవంత్‌రెడ్డి అధికారులతో సమీక్ష నిర్వహించనున్నారు. పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులకు రాష్ట్రంలో అందుబాటులో ఉన్న అవకాశాలను వివరించడం, కొత్త పెట్టుబడులకు మార్గం సుగమం చేయడం, పరిశ్రమల స్థాపనకు అనుకూలమైన వాతావరణాన్ని కల్పించడం వంటి అంశాలు ఈ సందర్భంగా ప్రాధాన్యం సంతరించుకోనున్నాయి. సమిట్ నిర్వహణకు సంబంధించి అవసరమైన ఏర్పాట్లు, వివిధ శాఖల మధ్య సమన్వయం, పెట్టుబడుల ప్రతిపాదనల పురోగతి వంటి అంశాలను అధికారులు ముఖ్యమంత్రికి వివరించే అవకాశం ఉంది. రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి పెట్టుబడులను కీలక సాధనంగా ఉపయోగించుకోవాలన్న ప్రభుత్వ లక్ష్యానికి ఈ కార్యక్రమం ప్రాధాన్యమైనదిగా భావిస్తున్నారు.

అర్బన్ మేనేజ్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్‌కు శంకుస్థాపన
పట్టణాభివృద్ధి, నగరాల నిర్వహణలో నిపుణులను తయారు చేయడం, ఆధునిక పట్టణ ప్రణాళికలకు అవసరమైన పరిజ్ఞానాన్ని పెంపొందించడం లక్ష్యంగా యాచారం మండలం కుర్మిద్దలో నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అర్బన్ మేనేజ్‌మెంట్‌కు సీఎం శంకుస్థాపన చేయనున్నారు. వేగంగా విస్తరిస్తున్న పట్టణ ప్రాంతాల్లో రవాణా, నీటి సరఫరా, పారిశుధ్యం, మురుగునీటి నిర్వహణ, పర్యావరణ పరిరక్షణ వంటి అంశాలు కీలకంగా మారుతున్నాయి. ఈ నేపథ్యంలో పట్టణ నిర్వహణకు సంబంధించిన నైపుణ్యాలు, ప్రణాళికా విధానాలు, పరిపాలనా సామర్థ్యాన్ని పెంపొందించే సంస్థల అవసరం పెరుగుతోంది. ఫ్యూచర్ సిటీ అభివృద్ధితో పాటు తెలంగాణలోని ఇతర పట్టణాల భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకుని ఈ సంస్థ ప్రాధాన్యం సంతరించుకోనుంది.

ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టులపై సమీక్ష
ఫ్యూచర్ సిటీని భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి చేయాలన్న లక్ష్యంతో ప్రభుత్వం పలు ప్రాజెక్టులపై దృష్టి సారిస్తోంది. ఈ క్రమంలో వివిధ అభివృద్ధి పనుల పురోగతిపై సీఎం రేవంత్‌రెడ్డి అధికారులతో సమీక్ష నిర్వహించనున్నారు. మౌలిక వసతుల కల్పన, రహదారుల అనుసంధానం, పారిశ్రామిక అభివృద్ధికి అవసరమైన సదుపాయాలు, పెట్టుబడులకు అనుకూలమైన వాతావరణం వంటి అంశాలు ఈ సమీక్షలో ప్రాధాన్యం పొందనున్నాయి. ప్రాజెక్టుల అమలులో ఎదురవుతున్న సమస్యలు, పనుల పురోగతి, తదుపరి చేపట్టాల్సిన చర్యలపై అధికారులకు సీఎం దిశానిర్దేశం చేయనున్నారు. ప్రణాళికాబద్ధమైన పట్టణాభివృద్ధి ద్వారా భవిష్యత్తులో పెరిగే జనాభా, పారిశ్రామిక అవసరాలకు తగిన సదుపాయాలను ముందుగానే కల్పించాలన్నది ప్రభుత్వ లక్ష్యంగా ఉంది.

పెట్టుబడులు, ఉపాధి అవకాశాలే కీలకం
ఫ్యూచర్ సిటీ అభివృద్ధిలో పెట్టుబడుల ఆకర్షణ, నైపుణ్యాభివృద్ధి, ఆధునిక మౌలిక వసతుల కల్పన పరస్పరం అనుసంధానమైన అంశాలుగా నిలవనున్నాయి. పరిశ్రమలు, సంస్థలు ఏర్పాటైతే వాటికి అవసరమైన నైపుణ్యమున్న మానవ వనరులను అందుబాటులో ఉంచడం, కొత్త ఉపాధి అవకాశాలను సృష్టించడం ముఖ్యమవుతుంది. అదే సమయంలో పట్టణ విస్తరణకు అనుగుణంగా రవాణా, ప్రజా సేవలు, పరిపాలనా వ్యవస్థలను అభివృద్ధి చేయాల్సి ఉంటుంది. ఈ అంశాలను దృష్టిలో ఉంచుకుని ఫ్యూచర్ సిటీ పరిధిలో చేపడుతున్న కార్యక్రమాల అమలుపై ప్రభుత్వం సమన్వయంతో ముందుకు సాగాలని భావిస్తోంది. సీఎం పర్యటనలో వివిధ రంగాలకు చెందిన ప్రాజెక్టులపై సమీక్ష జరగనుండటంతో వాటి పురోగతి, భవిష్యత్తు కార్యాచరణపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

తెలంగాణ అభివృద్ధికి కొత్త గ్రోత్ ఇంజిన్
ఫ్యూచర్ సిటీని రాష్ట్ర అభివృద్ధికి కొత్త గ్రోత్ ఇంజిన్‌గా తీర్చిదిద్దాలన్న ప్రభుత్వ ఆలోచనలో భాగంగా సోమవారం చేపట్టనున్న కార్యక్రమాలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. పోలీసు పరిపాలనకు అవసరమైన మౌలిక వసతుల నుంచి యువతకు నైపుణ్య శిక్షణ, అంతర్జాతీయ పెట్టుబడుల ఆకర్షణ నుంచి పట్టణ నిర్వహణకు సంబంధించిన సంస్థ ఏర్పాటు వరకు వివిధ రంగాలను అనుసంధానిస్తూ ప్రభుత్వం ముందుకు సాగుతోంది. ఈ ప్రాజెక్టులు నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా పూర్తయి, కార్యాచరణలోకి వస్తే రాష్ట్రంలో పారిశ్రామిక అభివృద్ధి, ఉపాధి అవకాశాలు, పట్టణ మౌలిక వసతుల మెరుగుదలకు దోహదపడే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ఫ్యూచర్ సిటీ అభివృద్ధి కార్యక్రమాల పురోగతిపై సీఎం రేవంత్‌రెడ్డి నిర్వహించనున్న సమీక్షపై ఆసక్తి నెలకొంది.


ఏపీలో స్థానిక సమరం

ముద్ర, అమరావతి:
ఏపీలో స్థానిక సంస్థల ఎన్నికల సందడి మొదలైంది. రాష్ట్రవ్యాప్తంగా ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న మండల పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గాలు (ఎంపీటీసీ), జిల్లా పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గాల (జెడ్పీటీసీ) ఎన్నికలకు రాష్ట్ర ఎన్నికల సంఘం సోమవారం నోటిఫికేషన్ జారీ చేసింది. రాష్ట్ర ఎన్నికల కమిషనర్ (ఎస్ఈసీ) అనిల్ చంద్ర పునేఠా విలేకరుల సమావేశంలో ఈ వివరాలను వెల్లడించారు. ఈ నోటిఫికేషన్‌తో రాష్ట్రంలో మరోసారి ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినట్లయింది. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 659 జెడ్పీటీసీ స్థానాలకు, 9,829 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఎస్ఈసీ స్పష్టం చేశారు. వాస్తవానికి రాష్ట్రంలో 663 జెడ్పీటీసీలు, 9,859 ఎంపీటీసీలు ఉండగా, కొన్ని కారణాల వల్ల మిగిలిన స్థానాలకు ఎన్నికలు నిర్వహించడం లేదని తెలిపారు. మొత్తంగా 10,488 స్థానాలకు ఈ ఎన్నికల ప్రక్రియ జరగనుంది. ఎన్నికల ప్రచార ఖర్చుపై కూడా కమిషన్ స్పష్టతనిచ్చింది. జెడ్పీటీసీ అభ్యర్థి గరిష్ఠంగా రూ.8 లక్షల వరకు, ఎంపీటీసీ అభ్యర్థి రూ.4 లక్షల వరకు ఖర్చు చేసుకోవచ్చని పునేఠా వివరించారు. ఎన్నికల నిర్వహణ కోసం 687 మందిని ఎంపీటీసీలకు, 28 మందిని జెడ్పీటీసీలకు రిటర్నింగ్ అధికారులు (ఆర్వో) నియమించినట్లు తెలిపారు.

ఎన్నికల షెడ్యూల్ వివరాలు
ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం, ఈ నెల అక్టోబర్ 21న రిటర్నింగ్ అధికారులు ఆయా స్థానాలకు ఎన్నికల ప్రకటన జారీ చేస్తారు. అదే రోజు ఓటర్ల జాబితాను కూడా ప్రదర్శిస్తారు.
నామినేషన్ల స్వీకరణ: అక్టోబర్ 21వ తేదీ ఉదయం 10:30 గంటల నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమవుతుంది. అక్టోబర్ 23వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్లు దాఖలు చేసేందుకు అవకాశం కల్పించారు.
పరిశీలన, అప్పీళ్లు: అక్టోబర్ 24న నామినేషన్ పత్రాలను పరిశీలిస్తారు. తిరస్కరణకు గురైన నామినేషన్లపై అభ్యర్థులు అప్పీలు చేసుకునేందుకు అక్టోబర్ 25 వరకు గడువు ఉంటుంది. ఎంపీటీసీ అభ్యర్థులు ఆర్డీఓకు, జెడ్పీటీసీ అభ్యర్థులు జిల్లా కలెక్టర్‌కు అప్పీలు చేసుకోవాల్సి ఉంటుంది. అక్టోబర్ 26న ఈ అప్పీళ్లపై తుది నిర్ణయం తీసుకుంటారు.
ఉపసంహరణ, తుది జాబితా: అక్టోబర్ 27వ తేదీ మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం కల్పించారు. అదే రోజు సాయంత్రం పోటీలో ఉన్న అభ్యర్థుల తుది జాబితాను ప్రకటిస్తారు.
పోలింగ్, లెక్కింపు: నవంబర్ 3వ తేదీన ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ జరుగుతుంది. ఏవైనా కారణాలతో పోలింగ్ నిలిచిపోతే, అవసరమైన చోట నవంబర్ 4న రీ-పోలింగ్ నిర్వహిస్తారు. నవంబర్ 5వ తేదీ ఉదయం 8 గంటల నుంచి ఓట్ల లెక్కింపు చేపట్టి, లెక్కింపు పూర్తయిన వెంటనే ఫలితాలను వెల్లడిస్తారు. ఈ షెడ్యూల్ ప్రకటనతో గ్రామీణ ప్రాంతాల్లో వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. ప్రధాన పార్టీలు దృష్టి సారించాయి.

వైకాపా నేతలు ఉన్మాదుల్లా వ్యవహరిస్తున్నారు

ముద్ర, అమరావతి :
ప్రజల నమ్మకాన్ని తమ ప్రభుత్వం వమ్ము చేయలేదని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. ఎన్ని సవాళ్లు ఎదురైనా ఇచ్చిన మాట నిలబెట్టుకున్నామని చెప్పారు. ప్రజల జీవన ప్రమాణాలు పెంచడమే తమ ప్రాధాన్యత అని తెలిపారు. ఉండవల్లిలో నిర్వహించిన మీడియా సమావేశంలో సీఎం మాట్లాడారు. స్థానిక ఎన్నికల పరిణామాలపైనా ఆయన స్పందించారు. వైకాపా నేతలు వ్యవహరిస్తున్న తీరుపై సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రాభివృద్ధిని చూసి ఓర్వలేక గొడ్డలిపార్టీ నేతలు రోడ్లు కూడా తవ్వుతున్నారని చంద్రబాబు మండిపడ్డారు. వైకాపా నేతలు ఉన్మాదుల్లా వ్యవహరిస్తున్నారన్నారు. మెగా డీఎస్సీని అడ్డుకోవాలని అనేకసార్లు కోర్టులకు వెళ్లారని.. గొడ్డలి పార్టీ చేసిన తప్పులు ప్రజల మనసు నుంచి ఎప్పటికీ పోవు అని వ్యాఖ్యానించారు.



స్థానిక సంస్థలు బలోపేతమైతేనే నిజమైన అధికార వికేంద్రీకరణ
'గత ప్రభుత్వ విధ్వంసంతో ఏపీ బ్రాండ్ కోల్పోయాం. ఇప్పుడిప్పుడే దాని నుంచి కోలుకుంటున్నాం. వైకాపా పాలనలో ప్రజలు ప్రశాంతంగా జీవించలేదు. స్థానిక ఎన్నికలతో పాటు ప్రతి ఎన్నికలకు ప్రాముఖ్యత ఉంటుంది. కేంద్రం, రాష్ట్రం, స్థానికం మూడింటికీ చాలా ప్రాధాన్యత ఉంది. స్థానిక సంస్థలు బలోపేతమైతేనే నిజమైన అధికార వికేంద్రీకరణ. ఇచ్చిన మాట నిలబెట్టుకుంటూ ప్రజలకు భద్రత, భరోసా కల్పించాం. గొడ్డలి పార్టీ విధ్వంసం వల్లే కూటమి విజయం సాధించింది. ఎక్కడా లేనివిధంగా 94 శాతం స్ట్రైక్‌రేట్‌తో ఘన విజయం సాధించాం.
చెప్పిన సమయానికి లబ్ధి చేకూరుస్తున్నాం
రూ.లక్షన్నర కోట్లతో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నాం. సంక్షేమ క్యాలెండర్ ఫిక్స్ చేసి చెప్పిన సమయానికి లబ్ధి చేకూరుస్తున్నాం. దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను పూర్తిచేస్తున్నాం. ప్రభుత్వం అందించే 55 సేవలపై నిత్యం ప్రజాభిప్రాయ సేకరణ చేస్తున్నాం. లోపాలు ఉంటే సరిదిద్దుకుంటున్నాం. రాయలసీమను మళ్లీ రతనాల సీమ చేస్తామని చెప్పాం. అభివృద్ధిలో దేశానికే రాయలసీమను ఒక నమూనాగా తయారుచేస్తాం. వెలిగొండకు నేనే శంకుస్థాపన చేశా.. మళ్లీ నేనుపచ్చాకే ఫేజ్-1 పూర్తిచేశా. మార్కాపురం ఇక కరవు ప్రాంతం కాదు.. అన్ని పంటలు పండే ప్రాంతంగా తయారు చేస్తాం. గత ప్రభుత్వంలో స్థానిక సంస్థల నిధులు మళ్లించేశారు. 93 కేంద్ర పథకాలు నిలిపివేశారు. జల్‌జీవన్ మిషన్ పథకాన్ని నిర్వీర్యం చేశారు. కేంద్రంతో మాట్లాడి దాన్ని పునరుద్ధరించాం' అని సీఎం వివరించారు.

బీఆర్ఎస్ లీగల్ నోటీసులు

ముద్ర, హైదరాబాద్:
బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ ప్రతిష్టను దెబ్బతీసేలా, కొండపోచమ్మ సాగర్ నీటిని కేసీఆర్ ఫామ్‌హౌస్‌కు మళ్లించారంటూ తప్పుడు ప్రచారం చేస్తున్న తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎంపీ గడ్డం వంశీకృష్ణలకు బీఆర్ఎస్ లీగల్ సెల్ నోటీసులు జారీ చేసింది. బీఆర్ఎస్ జనరల్ సెక్రటరీ, లీగల్ సెల్ ఇన్‌ఛార్జ్ సోమ భరత్ కుమార్ ఈ నోటీసులు పంపించారు.
ఇదే అంశంపై ఇప్పటికే వెలుగు దినపత్రిక యాజమాన్యం, ఎడిటర్‌కు నోటీసులు జారీ చేసిన నేపథ్యంలో, అదే ప్రచారాన్ని కొనసాగిస్తున్న ముగ్గురు కాంగ్రెస్ నేతలకు కూడా నోటీసులు పంపించారు. తమ సోషల్ మీడియా ఖాతాల్లో చేసిన సంబంధిత పోస్టులను తక్షణమే బేషరతుగా తొలగించి, తప్పుడు ప్రచారాన్ని ఉపసంహరించుకోవాలని బీఆర్ఎస్ లీగల్ సెల్ డిమాండ్ చేసింది. తెలంగాణ సాగునీటి ప్రాజెక్టులపై నిరాధార ఆరోపణలు చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలను సహించబోమని, నోటీసులకు స్పందించని పక్షంలో పరువు నష్టం సహా వర్తించే చట్టాల ప్రకారం తదుపరి న్యాయపరమైన చర్యలు చేపడతామని స్పష్టం చేసింది.

పోలీసుశాఖలో భారీ ప్రక్షాళన

ముద్ర, హైదరాబాద్:
హైదరాబాద్ నగరంలో పండగల సీజన్ సమీపిస్తున్న వేళ పోలీసు శాఖలో భారీగా మార్పులు చోటుచేసుకున్నాయి. హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో 75 మంది సబ్-ఇన్‌స్పెక్టర్లను (ఎస్ఐ) బదిలీ చేస్తూ నగర పోలీస్ కమిషనర్ వి.సి. సజ్జనార్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. పరిపాలనా సౌలభ్యం, శాంతిభద్రతల పటిష్ఠతలో భాగంగా ఈ బదిలీలు చేపట్టినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.
నగరంలోని వివిధ పోలీస్ స్టేషన్లు, లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్, క్రైమ్, కంట్రోల్ రూమ్ విభాగాల్లో పనిచేస్తున్న అధికారులను ఈ బదిలీల ప్రక్రియలో భాగంగా మార్పు చేశారు. ముఖ్యంగా ఎక్కువ కాలంగా ఒకేచోట పనిచేస్తున్న అధికారులను గుర్తించి వేర్వేరు స్టేషన్లు, విభాగాలకు కేటాయించినట్లు తెలుస్తోంది. బదిలీ అయిన అధికారులు తక్షణమే తమ కొత్త పోస్టింగ్‌లలో బాధ్యతలు స్వీకరించాలని కమిషనర్ స్పష్టంగా ఆదేశించారు. ఈ విషయంలో ఎలాంటి ఆలస్యం లేదా నిర్లక్ష్యం ప్రదర్శించినా కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. రాబోయే పండగలు, నగరంలో పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీ, భద్రతా అవసరాలను దృష్టిలో ఉంచుకునే ఈ మార్పులు చేసినట్లు పోలీసు వర్గాలు వెల్లడించాయి.

కేసీఆర్ సోషల్
ఇంజనీరింగ్ స్కెచ్!

(మొదటి పేజీ తరువాయి)
నిరుద్యోగ సమస్యలపై తన వాదనను పట్టభద్రుల ముందుకు తీసుకెళ్లే ప్రయత్నం చేస్తోంది. బీజేపీ కూడా తన పట్టణ ఓటు బ్యాంకు, కేంద్ర ప్రభుత్వ ప్రతిష్టను నమ్ముకుని అభ్యర్థుల ఎంపికపై దృష్టి సారిస్తోంది. దీంతో ఈ రెండు నియోజకవర్గాల్లో త్రిముఖ పోటీకి అవకాశాలు కనిపిస్తున్నాయి.
కేసీఆర్ ప్రకటన కోసం ఎదురుచూపులు!
అభ్యర్థుల ఎంపికపై బీఆర్ఎస్ అధిష్ఠానం కసరత్తు కొనసాగుతున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. అయితే అభ్యర్థుల పేర్లపై అధికారిక ప్రకటన వెలువడే వరకు తుది నిర్ణయంపై స్పష్టత లేదు. ఓటర్ల నమోదు, అభ్యర్థుల ఎంపిక, ప్రచార వ్యూహాలు ఈ ఎన్నికల్లో కీలకంగా మారనున్నాయి. కేసీఆర్ ఎలాంటి సామాజిక సమీకరణాలతో అభ్యర్థులను ఎంపిక చేస్తారు? కాంగ్రెస్ ముందస్తు వ్యూహాన్ని బీఆర్ఎస్ ఎలా ఎదుర్కొంటుంది? అన్నది ఇప్పుడు తెలంగాణ రాజకీయాల్లో ఆసక్తికరంగా మారింది.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
మంగళవారం 20.10.2026
www.mudranews.in | @mudranews

వాహన పూజలో గుమ్మడికాయకు ప్రత్యేక స్థానం!

దసరా సందర్భంగా కొత్త వాహనాలతో పాటు పాత వాహనాలకు కూడా పూజలు చేయించడం ఆనవాయితీ. ఈ సమయంలో వాహనం ముందు గుమ్మడికాయ కొట్టి, ప్రమాదాలు జరగకుండా చూడాలని దైవాన్ని ప్రార్థిస్తారు. ఇది వాహనదారుల భద్రతపై ఉన్న ఆకాంక్షను ప్రతిబింబించే సంప్రదాయంగా కొనసాగుతోంది.



రాష్ట్ర ప్రజలకు చంద్రబాబు దసరా శుభాకాంక్షలు

ముద్ర, అమరావతి :రాష్ట్ర ప్రజలందరికీ విజయదశమి శుభాకాంక్షలు. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా నిలిచే దసరా పండుగ మనకు గొప్ప స్ఫూర్తిని ఇస్తుంది. రైతన్న శ్రమకు తగిన ఫలితం, మహిళలకు సాధికారత, యువతకు మంచి భవిష్యత్తు అందించేందుకు మేం చేస్తున్న సంకల్పానికి ఆ జగన్మాత అనుగ్రహం లభించాలని ప్రార్థిస్తున్నాను. ఆ కనకదుర్గమ్మ ఆశీస్సులతో ఆంధ్రప్రదేశ్ అన్ని రంగాల్లో విజయాలు సాధిస్తూ, అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని, ప్రతి కుటుంబం సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో, శాంతి సౌభాగ్యాలతో వర్ధిల్లాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. రాష్ట్ర ప్రజలందరికీ దసరా పండుగ శుభాకాంక్షలు.

ప్రజలకు మంచి పాలన అందించండి

- చంద్రబాబు



ముద్ర, అమరావతి: మళ్లీ అధికారంలోకి వస్తాం.. రప్పా రప్పా నరికేస్తాం అని బెదిరించే మాటలు కాకుండా, బాగా పనిచేస్తామని చెప్పాలని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు సూచించారు. గతంలో చేసిన తప్పులను సరిదిద్దుకుని ప్రజలకు మెరుగైన పాలన అందించాలని అన్నారు. ప్రజలు వేసే ఓటు, ఇచ్చే మద్దతు మరింత శక్తిని ఇస్తాయని, వేగంగా పనిచేసేందుకు ఉత్సాహాన్నిస్తాయని పేర్కొన్నారు. రాజకీయాల్లో సేవాభావానికి గట్టి పునాది వేయాలని మీడియా సమావేశంలో చంద్రబాబు విజ్ఞప్తి చేశారు.

వైసీపీపై చంద్రబాబు తీవ్ర విమర్శలు

ముద్ర, అమరావతి: రాయచోటికి అంతర్రాష్ట్ర ముఠాలను, నేరస్థులను వైసీపీ తీసుకొచ్చిందని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆరోపించారు. పుంగనూరు, దర్శి, ధర్మవరం, తిరుపతి, పులివెందులలో వైసీపీ నేతలు ఇష్టానుసారంగా వ్యవహరించారని విమర్శించారు. స్థానిక ఎన్నికలు జరగకుండా 60 పిటిషన్లు వేసి, బీసీ రిజర్వేషన్లను వ్యతిరేకించారని పేర్కొన్నారు. నేరాలు, ఘోరాలు చేయడం వైసీపీకి అలవాటుగా మారిందని, హింస ఆ పార్టీ డీఎన్ఏలోనే ఉందని చంద్రబాబు మీడియా సమావేశంలో వ్యాఖ్యానించారు.

సింథటిక్ డ్రగ్స్ తయారీ ముఠా గుట్టురట్టు



ముద్ర, హైదరాబాద్ : తెలంగాణ ఈగల్ ఫోర్స్ పోలీసులు సింథటిక్ డ్రగ్స్ తయారీ ముఠా గుట్టురట్టు చేశారు. అంతర్రాష్ట్ర సింథటిక్ డ్రగ్స్ తయారీ, సరఫరా నెట్‌వర్క్‌ను ఛేదించారు. మహారాష్ట్రలోని గోండియా జిల్లా మారేగవ్‌లో రహస్య ల్యాబ్‌లో డ్రగ్స్ తయారు చేస్తున్నట్లు గుర్తించారు. డ్రగ్స్ తయారీకి వినియోగించినట్లు అనుమానిస్తున్న పరికరాలు, రసాయనాలను స్వాధీనం చేసుకున్నారు. తెలంగాణ, మహారాష్ట్రలో విస్తరించిన డ్రగ్స్ తయారీ, సరఫరా నెట్‌వర్క్‌పై ఈగల్ ఫోర్స్ బృందాలు దర్యాప్తు చేస్తున్నాయి. ఆగస్టు 8న బీబీనగర్ పోలీసుల తనిఖీల్లో భారీగా డ్రగ్స్, రసాయనాలను పోలీసులు పట్టుకున్నారు. 27.2కిలోల మెఫెడ్రోన్, 56.98 కిలోల అసిటోన్ స్వాధీనం చేసుకున్నారు. అప్పట్లో ముగ్గుర్ని అదుపులోకి తీసుకున్న బీబీనగర్ పోలీసులు.. కొండమడుగు, మౌలాలి ప్రాంతాల్లోని ల్యాబ్‌లతో సంబంధాలపై దర్యాప్తు చేశారు. డ్రగ్స్ తయారీకి ఉపయోగించే ప్రొపియోనిల్ క్లోరైడ్ సరఫరాపై ఆరా తీశారు. ఈ క్రమంలోనే మహారాష్ట్రకు చెందిన జేఎస్‌వీ గ్లోబల్స్ యజమాని జైరాజ్ కృష్ణ శెట్టిని అక్టోబర్ 17న ఈగల్ ఫోర్స్ అరెస్టు చేసింది. రసాయనాల సరఫరా, ల్యాబ్ నిర్వహణ, ప్రత్యేక పరికరాలు సమకూర్చడంలో ఎవరెవరి పాత్ర ఉందనే కోణంలో ఆయన్ను విచారించగా తీగలాగితే డొంక కదిలినట్లు మొత్తం ముఠా గుట్టురట్టయింది. మెఫెడ్రోన్‌తోపాటు అల్ప్రాజోలమ్, ఎఫెడ్రిన్ తయారీ ఆరోపణలపైనా దర్యాప్తు చేసిన పోలీసులు.. 11 మంది నిందితులను అదుపులోకి తీసుకున్నారు. మరో 13 మంది పరారీలో ఉండగా.. వారి కోసం గాలింపు కొనసాగుతోంది.

నకిలీ నంబర్‌ప్లేట్లు.. 100 మందిపై క్రిమినల్ కేసులు



ముద్ర, హైదరాబాద్: నకిలీ నంబర్‌ప్లేట్లతో వాహనాలు నడుపుతున్న వారిపై ట్రాఫిక్ పోలీసులు చర్యలకు ఉపక్రమించారు. గత 8 నెలల వ్యవధిలో 100 మందిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి.. వారి వాహనాలను సీజ్ చేశారు. ఈ మేరకు హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు ప్రకటన విడుదల చేశారు. వాహనాల రిజిస్ట్రేషన్ నంబర్ల దుర్వినియోగాన్ని అరికట్టేందుకు పోలీసులు ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు. అనధికారిక రిజిస్ట్రేషన్ నంబర్ ప్లేట్లను ప్రదర్శిస్తున్న వాహనదారులపై చర్యలకు ఉపక్రమించారు. ట్రాఫిక్ చలాన్‌ల నుంచి తప్పించుకోవడంతోపాటు, తమ వాహనాలను గుర్తించకుండా నకిలీ నంబరు ప్లేట్లను వినియోగిస్తున్నారనే ఫిర్యాదులు పెరగడంతో పోలీసులు చర్యలు చేపట్టారు. సీజ్ చేసిన వాహనాల్లో 88 ద్విచక్రవాహనాలు, 12 ఫోర్ వీలర్ వాహనాలు ఉన్నాయి.

సింగరేణి అధికారులకు దసరా కానుక

ముద్ర, హైదరాబాద్: సింగరేణి అధికారులకు తెలంగాణ ప్రభుత్వం దసరా కానుక ప్రకటించింది. కోల్‌ఇండియా తరహాలో వేతనాల పెంపునకు ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఎగ్జిక్యూటివ్ క్యాడర్ 1–7 వరకు.. సుమారు 1,800 మందికి ప్రయోజనం కలగనుంది. సెప్టెంబర్ 25 నుంచి ఆర్థిక ప్రయోజనాలు వర్తించేలా ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో సింగరేణి అధికారులు చేసిన విజ్ఞప్తిని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఈమేరకు నెరవేర్చారు.

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల్లో దసరాకు ప్రత్యేక స్థానం

ముద్ర, హైదరాబాద్: చెడుపై మంచి సాధించిన గెలుపు, అధర్మంపై ధర్మం సాధించిన విజయానికి ప్రతీక జరుపుకునే విజయదశమి పండుగ సందర్భంగా ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల్లో దసరాకు ప్రత్యేక స్థానం ఉందని అన్నారు. దసరా పండుగ మనకు ధైర్యం, ధర్మం, సత్యం, ఐకమత్యం, ఆత్మవిశ్వాసం వంటి గొప్ప విలువలను బోధిస్తుందని పేర్కొన్నారు. మనలోని అహంకారం, అసూయ, ద్వేషం, అన్యాయం వంటి చెడు లక్షణాలను తొలగించుకుని, ప్రేమ, కరుణ, సోదరభావం, మానవత్వంతో కూడిన సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఈ పండుగ సందేశమిస్తోందని అన్నారు.



ఈ విజయదశమి ప్రతి ఇంటా ఆనందాల పూలు పూయించాలని, ప్రతి కుటుంబంలో సుఖసంతోషాలు వెల్లివిరియాలని, ప్రతి ఒక్కరికీ ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు, విజయాలు చేకూరాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. క్షసుడైన మహిషాసురుడిని సంహరించి దుష్టశక్తులపై విజయం సాధించిన అమ్మవారి శక్తిని, శ్రీరాముడు రావణాసురుడిపై సాధించిన విజయాన్ని ఈ పర్వదినం మనకు గుర్తుచేస్తుందన్నారు. తెలంగాణలో దసరా సందర్భంగా జమ్మిచెట్టుకు పూజలు చేయడం, జమ్మి ఆకులను బంగారంగా భావించి పెద్దలకు ఇచ్చి ఆశీర్వాదాలు తీసుకోవడం ప్రత్యేక సంప్రదాయమని గుర్తు చేశారు. ఈ ఆచారం ప్రకృతిని ప్రేమించాలని, పెద్దలను గౌరవించాలని చాటిచెబుతుందని అన్నారు.

మహిషాసురమర్దినిగా మెరిసిన నిమిషాంబమ్మ

శరన్నవరాత్రుల్లో తొమ్మిదో రోజు భక్తులకు దివ్యదర్శనం



ముద్ర, బోడుప్పల్: శ్రీ దేవి శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా బోడుప్పల్ శ్రీ మాతా నిమిషాంబ దేవి ఆలయంలో తొమ్మిదో రోజు అమ్మవారు మహిషాసుర మర్దిని అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆదిపరాశక్తి స్వరూపిణిగా, దివ్య తేజస్సుతో వెలసిన అమ్మవారిని భక్తులు దర్శించుకుని పులకించిపోయారు.

దుష్టశక్తుల సంహారం, ధర్మరక్షణకు ప్రతీకగా నిలిచే మహిషాసురమర్దిని రూపం శక్తి, ధైర్యం, పరాక్రమాలకు నిదర్శనమని ఆలయ నిర్వాహకులు తెలిపారు. అధర్మంపై ధర్మం, అజ్ఞానంపై జ్ఞానం సాధించే విజయానికి ఈ అవతారం సంకేతమని వివరించారు. అమ్మవారి అనుగ్రహంతో భక్తులకు విఘ్నాలు తొలగి, సుఖశాంతులు, విజయాలు చేకూరాలని ఆకాంక్షించారు.

శ్రీ హంపీ విరూపాక్ష విద్యారణ్య మహా సంస్థానం, హంపి పీఠం ఆధ్వర్యంలో శరన్నవరాత్రి మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.

దేశంలో నిశ్శబ్ద విప్లవం

కాంగ్రెస్‌కు పెరుగుతున్న ప్రజామద్దతు
రాహుల్ నాయకత్వాన్ని కోరుకుంటున్న ప్రజలు
బీజేపీకి ప్రత్యామ్నాయం వైపు చూస్తున్న ప్రజలు
కష్టకాలంలో నిలిచిన కార్యకర్తలకు మరింత గుర్తింపు ఇవ్వాలని సూచన
మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

ముద్ర, హైదరాబాద్ : రాహుల్ గాంధీ నాయకత్వంలో దేశవ్యాప్తంగా నిశ్శబ్ద విప్లవం సాగుతోందని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖల మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. బీజేపీ, ప్రధాని నరేంద్రమోదీకి ప్రత్యామ్నాయం వైపు ప్రజలు చూస్తున్నారని అన్నారు. రాహుల్, కాంగ్రెస్‌కు పెరుగుతున్న ప్రజామద్దతు జాతీయ స్థాయిలో రాజకీయ మార్పు పట్ల ప్రజల్లో ఉన్న ఆకాంక్షకు నిదర్శనమని వ్యాఖ్యానించారు. చార్మినార్ వద్ద సోమవారం నిర్వహించిన రాజీవ్‌గాంధీ సద్భావన యాత్ర స్మారక దినోత్సవం, రాజీవ్ సద్భావన పురస్కార ప్రదానోత్సవానికి ఉత్తమ్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్లిష్ట పరిస్థితుల్లోనూ కాంగ్రెస్‌కు రాహుల్ సమర్థ నాయకత్వాన్ని అందించారని చెప్పారు. దేశవ్యాప్తంగా పార్టీ కార్యక్రమాల్లో ప్రజల భాగస్వామ్యం పెరగడం రాజకీయ మార్పునకు సంకేతమన్నారు. బీజేపీని ఓడించి, లౌకికవాదం, ప్రజాస్వామ్యం, జాతీయ సమైక్యతను బలోపేతం చేసే పోరాటంలో కార్యకర్తలు రాహుల్‌కు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. గత బీఆర్ఎస్ పాలనలో అనేక ఇబ్బందులను ఎదుర్కొని పార్టీ కోసం పనిచేసిన క్షేత్రస్థాయి కార్యకర్తలకు కాంగ్రెస్ ప్రభుత్వం మరింత గుర్తింపు ఇవ్వాలని ఉత్తమ్ సూచించారు. వారి పట్టుదల, త్యాగాలు, నిరంతర కృషి తెలంగాణలో కాంగ్రెస్ తిరిగి అధికారంలోకి రావడంలో కీలక పాత్ర పోషించాయని పేర్కొన్నారు. వారి సేవలను మరువరాదన్నారు. పార్టీ ముఖ్య కార్యక్రమాలకు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు మరింత ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. ప్రజాప్రతినిధులు విస్తృతంగా పాల్గొనడం ద్వారా కార్యకర్తలకు గుర్తింపు లభించడంతోపాటు సంస్థాగతంగా పార్టీ బలోపేతమవుతుందని చెప్పారు. ప్రభుత్వం, పార్టీ మధ్య సన్నిహిత సమన్వయం అవసరమని స్పష్టం చేశారు. మతసామరస్యం, జాతీయ సమైక్యత సందేశంతో రాజీవ్‌గాంధీ చేపట్టిన సద్భావన యాత్రను స్మరించుకుంటూ 1990 నుంచి ఏటా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న మాజీ పీసీసీ అధ్యక్షుడు వి. హనుమంతరావు, రాజీవ్ సద్భావన పురస్కార కమిటీని ఉత్తమ్ అభినందించారు. పదవులతో నిమిత్తం లేకుండా తాను ఈ కార్యక్రమానికి క్రమం తప్పకుండా హాజరవుతున్నట్లు తెలిపారు. జాతీయ సమైక్యత, మతసామరస్యం, సమాచార సాంకేతిక రంగం, పంచాయతీరాజ్, యువత సాధికారతకు రాజీవ్‌గాంధీ చేసిన కృషిని తెలంగాణ వ్యవహారాలు పర్యవేక్షిస్తున్న ఏఐసీసీ కార్యదర్శి సచిన్ ఎం. సావంత్ కొనియాడారు. ఐక్యత, పరస్పర గౌరవం, రాజకీయాలకు అతీతంగా జాతీయ ప్రయోజనాలకు ప్రాధాన్యం ఇవ్వడం రాజీవ్ ఆశయాలని పేర్కొన్నారు. కంప్యూటరీకరణ, సమాచార సాంకేతిక పరిజ్ఞానం ప్రాధాన్యాన్ని ఆయన ముందుగానే గుర్తించారని అన్నారు.

పంజాబ్, అసోం, మిజోరంలలో శాంతి పునరుద్ధరణకు రాజీవ్ కృషి చేశారని సావంత్ గుర్తుచేశారు. జాతీయ సమైక్యత విలువలను కాపాడాలని కోరారు. విద్వేషాన్ని ఎదుర్కొని సామాజిక ఐక్యతను పెంపొందించేందుకు రాహుల్ చేస్తున్న ప్రయత్నాలకు కార్యకర్తలు మద్దతుగా నిలవాలని పిలుపునిచ్చారు. రాజీవ్‌గాంధీ ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే ఆయనకు నిజమైన నివాళి అని వక్తలు పేర్కొన్నారు. ఈ సందర్భంగా సమాజానికి అందిస్తున్న విశిష్ట సేవలకు గుర్తింపుగా హైదరాబాద్‌లోని ఏషియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ నెఫ్రాలజీ అండ్ యూరాలజీ వ్యవస్థాపకుడు, మేనేజింగ్ డైరెక్టర్, చీఫ్ కన్సల్టెంట్ యూరాలజిస్ట్ డాక్టర్ సి. మల్లికార్జునను కార్యక్రమంలో సత్కరించారు. ప్రజాసేవకు అంకితమైన వ్యక్తులను గుర్తిస్తూ ఏటా కార్యక్రమాన్ని కొనసాగిస్తున్న నిర్వాహకులను వక్తలు అభినందించారు.

ఈ కార్యక్రమంలో టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్, ఏఐసీసీ కార్యదర్శి సచిన్ ఎం. సావంత్, మాజీ పీసీసీ అధ్యక్షుడు వి. హనుమంత రావు, మాజీ మంత్రి గీతారెడ్డి, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, సీనియర్ నాయకులు అంజన్ కుమార్bయాదవ్, ఫిరోజ్‌ఖాన్, డాక్టర్ సి. మల్లికార్జునతోపాటు పలువురు కాంగ్రెస్ నాయకులు, పార్టీ బాధ్యులు, రాజీవ్ సద్భావన పురస్కార కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అంతస్తులు పైపైకి... నీళ్లు పాతాళానికి!

ట్యాంకర్ల మయమవుతున్న మహానగరం..
బోడుప్పల్ నుంచి మణికొండ వరకు నీటి కటకటలు

హైదరాబాద్ మహానగరం ఆకాశాన్ని తాకుతోంది. నలుదిక్కులా బహుళ అంతస్తుల భవనాలు, ఐటీ సంస్థలు, విలాసవంతమైన నివాస సముదాయాలు వెలుస్తున్నాయి. కానీ ఈ అభివృద్ధి వెనుక నీటి సంక్షోభం ప్రమాద ఘంటికలు మోగిస్తోంది. భవనాల సంఖ్య పెరుగుతున్న కొద్దీ భూగర్భ జలాలు అడుగంటుతున్నాయి. ఒకప్పుడు బోరుబావులతో అవసరాలు తీర్చుకున్న కుటుంబాలు ఇప్పుడు ట్యాంకర్ల కోసం ఎదురుచూస్తున్నాయి. నగర శివార్లలో మొదలైన ఈ సమస్య క్రమంగా మహానగరమంతా విస్తరిస్తోంది.

బోడుప్పల్ నుంచి మణికొండ వరకు ఇదే పరిస్థితి!

బోడుప్పల్, మేడిపల్లి, ఉప్పల్, ఎల్బీనగర్, మణికొండ, నెక్నాంపూర్, కొండాపూర్, గచ్చిబౌలి, మాదాపూర్ తదితర ప్రాంతాల్లో నీటి అవసరాలు వేగంగా పెరుగుతున్నాయి. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా సరఫరా వ్యవస్థ విస్తరించకపోవడం, బోర్లలో నీటి లభ్యత తగ్గడం సమస్యను తీవ్రతరం చేస్తున్నాయి.

సాధారణంగా వేసవిలో పెరిగే ట్యాంకర్ల డిమాండ్ ఈసారి అక్టోబరులోనే అసాధారణ స్థాయికి చేరింది. అక్టోబరు 15న వెలువడిన నివేదిక ప్రకారం, నగరంలో రోజుకు సుమారు 5 వేల నుంచి 8 వేల వరకు ట్యాంకర్ బుకింగ్‌లు నమోదవుతున్నాయి. బోడుప్పల్‌లో బుకింగ్‌ల పెరుగుదల 2,132 శాతంగా, మణికొండలో 769 శాతంగా నమోదైనట్లు జలమండలి గణాంకాలను ఉటంకిస్తూ ఆ నివేదిక పేర్కొంది. నీటి అవసరాలు ఎంత వేగంగా పెరుగుతున్నాయో ఈ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.

వర్షాలు కురిసినా అడుగంటుతున్న జలాలు!

తెలంగాణ భూగర్భజల శాఖ గణాంకాల ప్రకారం, హైదరాబాద్ ప్రధాన పట్టణ ప్రాంతంలో 2026 సెప్టెంబరు నాటికి సగటు భూగర్భజల మట్టం భూమి ఉపరితలం నుంచి 11.58 మీటర్ల లోతులో నమోదైంది. గత ఏడాది ఇదే నెలతో పోలిస్తే జలమట్టం 6.85 మీటర్ల మేర దిగువకు చేరింది. సెప్టెంబరు చివరి వరకు సాధారణంగా 619 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా, 457 మిల్లీమీటర్లు మాత్రమే నమోదైంది.



వర్షపాత లోటుతో పాటు నగరమంతా కాంక్రీటు నిర్మాణాలు విస్తరించడం, ఖాళీ స్థలాలు తగ్గిపోవడం, చెరువులకు నీరు చేరే మార్గాలు మూసుకుపోవడం వల్ల వర్షపు నీరు భూమిలోకి ఇంకడం తగ్గుతోంది. 2025–26 భూగర్భజల వనరుల అంచనాల ప్రకారం, హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలతో కూడిన పట్టణ ప్రాంతంలో అందుబాటులో ఉన్న వార్షిక భూగర్భజల వనరుల్లో దాదాపు 70 శాతం మేర నీటిని వెలికితీస్తున్నారు. హైదరాబాద్ జిల్లాలోని 16 అంచనా యూనిట్లలో 15 క్రిటికల్ లేదా ఓవర్ ఎక్స్‌ప్లాయిటెడ్ విభాగాల్లో ఉన్నట్లు గణాంకాలు సూచిస్తున్నాయి.

పెరుగుతున్న అవసరాలు.. తీరని సరఫరా!

2026 అక్టోబరులో వెల్లడైన అంచనాల ప్రకారం, నగరానికి రోజుకు సుమారు 585 మిలియన్ గ్యాలన్ల నీరు సరఫరా అవుతుండగా, అవసరం 750 మిలియన్ గ్యాలన్లకు చేరింది. 2027 నాటికి ఈ అవసరం 835 మిలియన్ గ్యాలన్లకు పెరగవచ్చని అంచనా. సరఫరా సామర్థ్యం అదే స్థాయిలో ఉంటే నీటి కొరత మరింత తీవ్రమయ్యే ప్రమాదం ఉంది.

గోదావరి రెండో, మూడో దశల నీటి పథకాల ద్వారా అదనపు నీటిని నగరానికి తీసుకురావడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. సుమారు రూ.7,360 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన ఈ ప్రాజెక్టు పనులను 2027 అక్టోబరు నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. అయితే అప్పటివరకు పెరుగుతున్న డిమాండ్‌ను ఎలా తట్టుకోవాలన్నది కీలకంగా మారింది.

చెరువుల పరిరక్షణే శాశ్వత పరిష్కారం!

నీటి సంక్షోభానికి మరిన్ని ట్యాంకర్లను సమకూర్చడం మాత్రమే పరిష్కారం కాదు. చెరువులు, కుంటలు, వాటికి నీరు చేరే నాలాలను పరిరక్షించాలి. ఆక్రమణలను తొలగించి వర్షపు నీరు సహజంగా చెరువులకు చేరే మార్గాలను పునరుద్ధరించాలి. అపార్ట్‌మెంట్లు, వాణిజ్య భవనాల్లో రెయిన్‌వాటర్ హార్వెస్టింగ్ వ్యవస్థలు ఏర్పాటు చేయడమే కాకుండా, అవి సమర్థంగా పనిచేస్తున్నాయో లేదో పర్యవేక్షించాలి.

మరోవైపు, శుద్ధి చేసిన మురుగునీటిని ఉద్యానవనాలు, నిర్మాణ పనులు, ఇతర అవసరాలకు వినియోగించేలా చర్యలు చేపట్టాలి. నీటి పైపులైన్ల లీకేజీలను అరికట్టి, సరఫరా నష్టాలను తగ్గించాలి. భారీ భవనాల నిర్మాణ అనుమతుల సమయంలో నీటి లభ్యత, వర్షపు నీటి సంరక్షణ, మురుగునీటి పునర్వినియోగాన్ని కీలక ప్రమాణాలుగా పరిగణించాలి.

నగర భవిష్యత్తును నిర్ణయించేది నీరే!

హైదరాబాద్ అంతర్జాతీయ స్థాయి నగరంగా ఎదగడం ఆహ్వానించదగిన పరిణామమే. పెట్టుబడులు, ఉపాధి అవకాశాలు, భారీ నిర్మాణాలు పెరగాలి. కానీ అభివృద్ధికి అవసరమైన సహజ వనరులను నిర్లక్ష్యం చేస్తే భవిష్యత్తులో అదే అభివృద్ధి భారంగా మారుతుంది. ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేస్తూ నీటి వనరుల సంరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలి. ప్రజలు కూడా నీటిని పొదుపుగా వినియోగించాలి.

ఆకాశాన్ని తాకే భవనాలు నగర అభివృద్ధికి ప్రతీకలైతే.. భూమి అడుగున నిలిచే నీరే ఆ నగర మనుగడకు అసలైన ఆధారం! ఇప్పటికైనా మేల్కొనకపోతే భవిష్యత్తు తరాలకు జలగండం తప్పదు.



- నాగేశ్వరరావు బల్లెడ
సీనియర్ జర్నలిస్ట్,
హైదరాబాద్

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
www.mudranews.in | @mudranews

మంగళవారం,
20 అక్టోబర్, 2026

4 వేదిక
Peoples Voice

నా తెలంగాణ కోటి రతనాల వీణ అన్నాడు 'దాశరథి'.. నైజాం పాలనలో 'బండెనక బండి కట్టి'.. పాటలతో ఉద్యమాన్ని రగిలించిన నేల ఇదీ.. తెలంగాణ రక్తంలోనే కవిత్వం ఉంది.. కవులు, కళాకారులకు ఈ నేల పుట్టినిల్లు.. అందుకే మీలోని రచయితను మేల్కొలపండి.. కవితలు, వ్యాసాలు, ఏవైనా సరే.. మేం ప్రచురిస్తాం.. మన 'ముద్ర'లో ఎడిటోరియల్ గా మీ భావాలను వ్యక్తీకరించండి..

వాట్సప్ నం.: 9849623744
మేయిల్: mudradaily@gmail.com

గర్భ నిరోధక మాత్రలు, గర్భస్రావం
తేడా ఏంటి?



"డాక్టర్ దగ్గరకు వెళ్లాల్సిన అవసరం ఏముంది? ఫార్మసీలో మాత్రలు దొరుకుతున్నాయి కదా"

ఈ ఆలోచనతో గర్భస్రావం చేసుకోవడానికి కొందరు మహిళలు తమ స్నేహితులు, సోషల్ మీడియా, ఇంటర్నెట్ లేదా ఫార్మసీ సలహాల ఆధారంగా మందులు తీసుకుంటున్నారు. మరికొందరికి గర్భనిరోధక మాత్రలు, ఎమర్జెన్సీ కాంట్రసెప్టివ్ మాత్రలు, గర్భస్రావం (మెడికల్ అబార్షన్) మాత్రలు.. ఇవన్నీ ఒకటే అనే అపోహ ఉంది.

కానీ ఇవన్నీ పూర్తిగా వేర్వేరు.

ఒక మాత్ర గర్భం రాకుండా నిరోధిస్తుంది. మరొకటి అత్యవసర పరిస్థితిలో గర్భధారణ అవకాశాన్ని తగ్గిస్తుంది. ఇంకొకటి ఇప్పటికే ఏర్పడిన గర్భాన్ని వైద్య పద్ధతిలో తొలగించడానికి ఉపయోగిస్తారు. ఈ తేడా తెలియకపోవడం వల్ల తప్పు మందు తీసుకోవడం, గర్భధారణ కాలాన్ని తప్పుగా అంచనా వేయడం, ఎక్టోపిక్ ప్రెగ్నెన్సీని (గర్భ సంచి బయట పిండం ఏర్పడటం) గుర్తించకపోవడం, అధిక రక్తస్రావాన్ని నిర్లక్ష్యం చేయడం వంటి వాటి వల్ల సమస్యలు రావచ్చు. అందుకే దీనిపై భయం కాకుండా సరైన అవగాహన అవసరం. గర్భ నిరోధక మాత్రలు, గర్భస్రావం మాత్రలు.. ఈ రెండూ ఒకటి కాదు.

మరి ఏ మాత్ర ఎప్పుడు వేసుకోవాలి? వీటితో సైడ్ ఎఫెక్ట్స్ ఉంటాయా?

ఇంట్లోనే గర్భస్రావం చేసుకోవడం ఎప్పుడు సురక్షితం? ఎప్పుడు ప్రమాదం? ఒక చిన్న కథ... కానీ చాలా ముఖ్యమైన సందేశం 26 ఏళ్ల మహిళకు నెలసరి రావడం ఆలస్యమైంది. కొన్ని వారాల క్రితం రక్షణలేని లైంగిక చర్య జరిగింది. "గర్భం రాకుండా ఉండటానికి ఒక ఎమర్జెన్సీ పిల్ వేసుకున్నాను కాబట్టి గర్భం ఉండదు" అని ఆమె అనుకున్నారు. కొన్ని రోజుల తర్వాత కూడా నెలసరి రాకపోవడంతో ఒక స్నేహితురాలు మరో టాబ్లెట్ సూచించారు. ఫార్మసీలో కూడా మరో మందు తీసుకున్నారు. ఆ మందులు తీసుకున్న తర్వాత రక్తస్రావం మొదలైనప్పటికీ, కడుపునొప్పి తీవ్రంగా ఉంది. అయినా సరే.. మొదట తీసుకున్న మాత్ర పనిచేస్తోందనుకుని ఇంట్లోనే ఉండిపోయారు. కొన్ని గంటల తర్వాత తల తిరగడం, బలహీనత, మూర్ఛ వచ్చే పరిస్థితి ఏర్పడింది. ఆసుపత్రికి తీసుకెళ్లగా ఎక్టోపిక్ ప్రెగ్నెన్సీ ఉన్నట్లు తేలింది.

ఇక్కడ అసలు సమస్య "టాబ్లెట్ పనిచేయలేదా?" అనేది కాదు. గర్భం ఎక్కడ ఏర్పడిందో తెలియకుండా మందులు తీసుకోవడం.. అది ప్రమాదం. అందుకే గర్భస్రావం విషయంలో టాబ్లెట్ పేరు" కంటే ముందుగా... గర్భం ఉందా? ఎంతకాలమైంది? గర్భం గర్భాశయంలో ఉందా? ట్యూబుల్లో ఉందా? మహిళ ఆరోగ్య పరిస్థితి ఎలా ఉంది? అనే ప్రశ్నలకు సమాధానం అవసరం.

ఈ మాత్రల గురించి మూడు విషయాలు

1. గర్భనిరోధక మాత్రలు – గర్భం రాకుండా నిరోధించడానికి ఉపయోగిస్తారు. ఇవి మహిళలు క్రమం తప్పకుండా తీసుకునే కాంట్రసెప్టివ్ పిల్స్.

ఇవి ప్రధానంగా రెండు రకాలుంటాయి:

కంబైన్డ్ ఓరల్ కాంట్రసెప్టివ్ పిల్స్ (COCs) ఇందులో ఈస్ట్రోజెన్, ప్రొజెస్టిన్ ఉంటాయి.

ప్రోజెస్టిన్ ఓన్లీ పిల్స్ (POPs) — ఇందులో ప్రొజెస్టిన్ మాత్రమే ఉంటుంది. ఇవి ప్రధానంగా అండోత్సర్గాన్ని అడ్డుకోవడం, గర్భాశయ ముఖద్వారంలోని మ్యూకస్‌ను మారుస్తూ స్పెర్మ్‌కు అడ్డంకి కల్పించడం వంటి విధానాల ద్వారా గర్భధారణ అవకాశాన్ని తగ్గిస్తాయి. డబ్ల్యూహెచ్ఓ ప్రకారం.. సరైన విధంగా ఉపయోగించినప్పుడు ఓరల్ కాంట్రసెప్టివ్ పిల్స్ చాలా ప్రభావవంతమైన గర్భనిరోధక పద్ధతులు. అయితే అన్ని మాత్రలూ అందరికీ సరిపోక పోవచ్చు. మహిళ ఆరోగ్య పరిస్థితి, ఇతర మందులు, రక్తం గడ్డకట్టే సమస్యల వంటి అంశాలను పరిగణనలోకి తీసుకోవాలి. ఇప్పటికే ఏర్పడిన గర్భాన్ని తొలగించడానికి గర్భనిరోధక మాత్రలు ఉపయోగపడవు.

2. అత్యవసర గర్భనిరోధక మాత్రలు – రక్షణలేని లైంగిక చర్య తర్వాత గర్భధారణ అవకాశాన్ని తగ్గించడానికి ఇవి ఉపయోగిస్తారు. ఇవి ప్రధానంగా అండం విడుదలను ఆలస్యం చేయడం లేదా నిరోధించడం ద్వారా పనిచేస్తాయి. లైంగిక చర్య తర్వాత వీలైనంత త్వరగా ఉపయోగిస్తే ఇవి ఎక్కువ ప్రభావవంతంగా ఉంటాయి. ఎమర్జెన్సీ కాంట్రసెప్టివ్ పిల్స్ ఇప్పటికే ఏర్పడిన గర్భాన్ని తొలగించవు అని డబ్ల్యూహెచ్ఓ స్పష్టంగా చెబుతోంది. అవి గర్భస్రావాన్ని ప్రేరేపించవు.

3. వైద్యపరమైన గర్భస్రావ మాత్రలు (మెడికల్ అబార్షన్ పిల్స్) – ఇప్పటికే ఏర్పడిన గర్భాన్ని వైద్యపద్ధతిలో తొలగించడానికి ఇవి ఉపయోగిస్తారు. ఈ మూడు మందులను ఒకదానికొకటి ప్రత్యామ్నాయంగా భావించడం తప్పు. మరి వైద్యపరమైన గర్భస్రావ మాత్రలు ప్రమాదకరమా? సరైన పరిస్థితుల్లో, సరైన గర్భధారణ కాలానికి సరిపోయే, డబ్ల్యూహెచ్ఓ సూచించిన పద్ధతిని ఉపయోగిస్తే వైద్యపరమైన గర్భస్రావం సాధారణంగా సురక్షితమైన వైద్యపద్ధతి. అంటే "అబార్షన్ మాత్రలు ప్రమాదకరం" అనడం కూడా తప్పు. అదే సమయంలో "ఎవరైనా, ఎప్పుడైనా, ఏ పరిస్థితిలోనైనా ఫార్మసీ నుంచి మాత్రలు కొనుక్కొని తీసుకుంటే సరిపోతుంది" అనడం కూడా తప్పు. సురక్షితమైన వైద్యపద్ధతి, తెలియకుండా మందులు తీసుకోవడం మధ్య చాలా తేడా ఉంది. ఇంట్లో సొంతంగా వైద్యపరమైన గర్భస్రావం జరగడం అంటే అది తప్పని సరిగా అసురక్షితం అని కూడా కాదు. డబ్ల్యూహెచ్ఓ 2025 గర్భస్రావ మార్గదర్శకాల ప్రకారం... 12 వారాల కంటే తక్కువ గర్భధారణలో సరైన సమాచారం, నాణ్యమైన మందులు, అవసరమైనప్పుడు శిక్షణ పొందిన ఆరోగ్య కార్యకర్త సహాయం, అవసరమైతే అత్యవసర వైద్య సేవలు అందుబాటులో ఉన్న పరిస్థితిలో వైద్యపరమైన గర్భస్రావాన్ని ఇంట్లోనే మహిళ చేసుకోవచ్చు. అయితే.. "ఇంట్లో తీసుకోవడం" ఒక్కటే ప్రమాదానికి కారణం కాదు. కొన్నిసార్లు ట్యూబ్ ఎక్టోపిక్ ప్రెగ్నెన్సీలో ఫాలోపియన్ ట్యూబ్ పగిలిపోయి తీవ్రమైన అంతర్గత రక్తస్రావం జరగవచ్చు. దీని వలన ఒక వైపు తీవ్రమైన కడుపు నొప్పి, భుజం నొప్పి, తల తిరగడం, మూర్ఛ, తీవ్రమైన బలహీనత వంటి లక్షణాలు ఉండొచ్చు. కాబట్టి ఈ పరిస్థితుల్లో ఇంట్లో మాత్రలు తీసుకుని వేచి ఉండటం ప్రమాదకరం. కాబట్టి గర్భం ఉందని తెలుసుకోవడం ఒక్కటే సరిపోదు.. గర్భం ఎక్కడ ఉందో కూడా తెలుసుకోవాలి.

గర్భం పూర్తిగా బయటకు రాకపోతే?

మెడికల్ అబార్షన్ తర్వాత కొన్నిసార్లు గర్భ కణజాలం పూర్తిగా బయటకు రాకపోవచ్చు. దీన్ని ఇన్‌కంప్లీట్ అబార్షన్ అంటారు. దీని వల్ల ఎక్కువ రోజులు రక్తస్రావం అవడం, కడుపులో నొప్పి, ఇన్ఫెక్షన్లు, ఎనీమియా వంటి సమస్యలు రావచ్చు. అవసరాన్ని బట్టి వైద్యుడి పరిశీలనలో ఉంచి, తగిన చికిత్సా విధానాన్ని సూచించవచ్చు. అందుకే "రక్తస్రావం మొదలైంది కాబట్టి అబార్షన్ పూర్తయింది" అనే భావనకు రాకూడదు.

"అబార్షన్ మాత్రలు భవిష్యత్తులో పిల్లలు పుట్టకుండా చేస్తాయా?"

సరైన పద్ధతిలో చేసే మెడికల్ అబార్షన్ సాధారణంగా భవిష్యత్తు ఫెర్టిలిటీని నాశనం చేయదు. మెడికల్ అబార్షన్ తర్వాత ఫెర్టిలిటీ త్వరగా తిరిగి రావచ్చు. కాబట్టి ప్రెగ్నెన్సీ కోరుకోని మహిళలు తదుపరి గర్భనిరోధక పద్ధతి గురించి వెంటనే ఆలోచించాలి.

గర్భనిరోధక మాత్రల సైడ్ ఎఫెక్ట్స్

ఓరల్ కాంట్రసెప్టివ్ పిల్స్ కొంతమంది మహిళల్లో వికారం, తల నొప్పి, తల తిరగడం, రొమ్ము నొప్పి, మూడ్ స్వింగ్స్, నెలసరి సరిగా రాకపోవడం వంటి లక్షణాలకు కారణం కావచ్చు. చాలా సందర్భాల్లో ఇవి కాలక్రమేణా తగ్గుతాయి. అయితే కొన్ని పిల్స్‌లో ఈస్ట్రోజెన్ ఉండటం వల్ల కొన్ని అరుదైన, తీవ్రమైన సమస్యలు — ముఖ్యంగా రక్తం గడ్డ కట్టడం, స్ట్రోక్, హార్ట్ అటాక్ వచ్చే ప్రమాదం కొందరిలో పెరగవచ్చు. అందుకే వ్యక్తిగత వైద్య చరిత్ర ఆధారంగా గర్భనిరోధక విధానాన్ని ఎంపిక చేయాలి. 'మాత్రలు వేసుకున్న మహిళ చనిపోయింది'.. ఇలాంటి వార్తలను ఎలా అర్థం చేసుకోవాలి? కొన్నిసార్లు పత్రికల్లో లేదా సోషల్ మీడియాలో "అబార్షన్ మాత్రలు వేసుకున్న మహిళ మృతి" లాంటి వార్తలు కనిపిస్తుంటాయి. ఇలాంటి వార్తలు మనల్ని అప్రమత్తం చేయాలి. మందు తీసుకున్న తర్వాత ఒక మహిళ చనిపోతే దానికి ఆ మాత్రలే కారణమని తేల్చలేం.

ప్రెగ్నెన్సీ ఎన్ని వారాలు?

పిండం గర్భ సంచి లోపల ఉందా లేదా బయట ఉందా?
ఏ మందు తీసుకున్నారు?
ఆ మందు నాణ్యమైనదేనా?
ఇతర వ్యాధులున్నాయా?
రక్తహీనత ఉందా?
ఎంత రక్తస్రావం జరిగింది?
ఏమైనా ఇన్ఫెక్షన్ ఉందా?
ఆసుపత్రిలో ఎప్పుడు చేరారు?
ఇతర మందులు ఏం తీసుకున్నారు?
మరణ ధ్రువీకరణ పత్రం / వైద్య రికార్డుల్లో మరణానికి గల కారణం ఏమిటి?

వైద్యపరంగా ఇలాంటి ఎన్నో అంశాలను పరిగణించిన తర్వాతే దాన్ని పూర్తిగా అర్థం చేసుకోవచ్చు.

భారత్‌లో చట్టపరమైన అవగాహన

భారత్‌లో మెడికల్ టెర్మినేషన్ ఆఫ్ ప్రెగ్నెన్సీ (MTP) (అమెండ్‌మెంట్స్) యాక్ట్ – 2021 అబార్షన్‌కు సంబంధించిన మార్గదర్శకాలను సూచిస్తోంది. దీని ప్రకారం కొన్ని నిర్దిష్ట పరిస్థితుల్లో 20 వారాల వరకు టెర్మినేషన్‌కు ఒక రిజిస్టర్డ్ మెడికల్ ప్రాక్టీషనర్ అభిప్రాయం, అలాగే కొన్ని నిర్దేశిత వర్గాల్లో 20–24 వారాల మధ్య ఇద్దరు రిజిస్టర్డ్ మెడికల్ ప్రాక్టీషనర్‌ల అభిప్రాయం అవసరమనే నిబంధనలు ఉన్నాయి. చట్టంలో మరిన్ని ప్రత్యేక పరిస్థితులు, రక్షణ చర్యలు కూడా ఉన్నాయి. అందువల్ల "అనుకోకుండా గర్భం వస్తే చట్టపరంగా ఏమీ చేయలేం" అనుకోవడం కూడా తప్పు. అదే సమయంలో "ఏ మాత్రనైనా ఎవరికైనా ఇచ్చి ఇంట్లోనే గర్భాన్ని ముగించవచ్చు" అనుకోవడం కూడా సరైనది కాదు. చట్టబద్ధమైన, సురక్షితమైన ఆరోగ్య సేవలను పొందడమే కీలకం.

అపోహలు – నిజాలు

అపోహ: "గర్భనిరోధక మాత్రలు, అబార్షన్ మాత్రలు ఒకటే."
నిజం: రెండూ పూర్తిగా వేర్వేరు ప్రయోజనాల కోసం ఉపయోగిస్తారు.

అపోహ: "ఎమర్జెన్సీ పిల్ గర్భాన్ని తొలగిస్తుంది."
నిజం: ఎమర్జెన్సీ పిల్ ఓవులేషన్‌ను ఆలస్యం/నిరోధించడం ద్వారా ప్రెగ్నెన్సీ రాకుండా చేస్తాయి. ఇప్పటికే ఏర్పడిన ప్రెగ్నెన్సీని టెర్మినేట్ చేయవు.

అపోహ: "మెడికల్ అబార్షన్ అంటే ఎప్పుడైనా ప్రమాదమే."
నిజం: సరైన పద్ధతిలో, తగిన హెల్త్ కేర్ సపోర్ట్‌తో మెడికల్ అబార్షన్ చేయడం సురక్షితమైన వైద్యపద్ధతి.

అపోహ: "మాత్ర తీసుకున్న వెంటనే ఎక్కువ రక్తం వస్తే అది ప్రమాదం."
నిజం: మెడికల్ అబార్షన్‌లో రక్తస్రావం సాధారణంగా జరగవచ్చు. అయితే ఎక్కువ రక్తస్రావం జరిగి, తీవ్రమైన కడుపు నొప్పి, తల తిరగడం, జ్వరం వంటి లక్షణాలు వస్తే అత్యవసర వైద్య సహాయం అవసరం.

అపోహ: "ఒకసారి అబార్షన్ చేస్తే ఇక పిల్లలు పుట్టరు."
నిజం: సరైన మెడికల్ అబార్షన్ సాధారణంగా భవిష్యత్తు ఫెర్టిలిటీని దెబ్బతీయదు.

అపోహ: "ఎమర్జెన్సీ పిల్‌ను రెగ్యులర్‌గా గర్భ నిరోధకానికి వాడుకోవచ్చు."
నిజం: ఎమర్జెన్సీ పిల్ అత్యవసర పరిస్థితుల కోసం ఉద్దేశించినది. తరచుగా అవసరమవుతుంటే రెగ్యులర్ గర్భ నిరోధక విధానం గురించి కౌన్సెలింగ్ తీసుకోవడం మంచిది.

అపోహ: "ఫార్మసీలో దొరికే మాత్రలే కాబట్టి డాక్టర్ అవసరం లేదు."
నిజం: మందు అందుబాటులో ఉండటం, అది మీకు సురక్షితంగా ఉండటం.. ఈ రెండూ వేర్వేరు విషయాలు.

మహిళలు గుర్తుంచుకోవాల్సిన "5 ప్రశ్నలు"

ఏదైనా గర్భస్రావ మందు తీసుకునే ముందు మహిళ తనకు తాను ఈ ఐదు ప్రశ్నలు వేసుకోవాలి:

1. నిజంగా ప్రెగ్నెన్సీ ఉందా?
2. ప్రెగ్నెన్సీ వచ్చి ఎంతకాలమైంది?
3. ప్రెగ్నెన్సీ గర్భాశయంలోనే ఉందా – దీనిపై ఏమైనా అనుమానం ఉందా?
4. నాకు ఏదైనా మెడికల్ కండిషన్ లేదా కాంట్రా ఇండికేషన్ ఉందా?
5. సమస్య వస్తే వెంటనే ఎక్కడ వైద్య సేవలు పొందగలను?

ఈ ఐదు ప్రశ్నలకు సమాధానాలు తెలియకపోతే.. స్వయంగా మందులు తీసుకోవడం కంటే ముందుగా హెల్త్ కేర్ ప్రొవైడర్‌ను సంప్రదించడం మంచిది. అనుకోని గర్భధారణ గురించి చాలా మంది మహిళలు భయపడటానికి ఒక కారణం సామాజిక ఒత్తిడి, తమ ప్రైవసీపై ఆందోళన. దీని వల్ల కొందరు వైద్యుడిని సంప్రదించకుండా స్నేహితుల సలహా, సోషల్ మీడియా వీడియోలు, ఫార్మసీ సలహాలు, పాత ప్రిస్క్రిప్షన్ ఆధారంగా మందులు తీసుకుంటారు. కానీ ఆరోగ్య సమస్యను దాచడం కంటే నమ్మకమైన హెల్త్ కేర్ ప్రొవైడర్‌తో గోప్యంగా మాట్లాడటం సురక్షితమైన మార్గం.



ఇగో వదిలేసెయ్..

నేను అన్నది అహంకారం. అది చాలా మందికి అలంకారం. నేను గొప్ప అన్నది తలకెక్కిన గర్వం. అన్నీ నాకే తెలుసు అన్నది కూడా మితిమీరిన తీరుకు నిదర్శనంగా చూస్తారు. ఈ లోకంలో ఎవరికీ అన్నీ తెలియవు. ఇంకా చెప్పాలి అంటే ఎవరికి ఏమి తెలిసినా అది గోరంత మాత్రమే. కొండంత ఉన్న విషయాన్ని తెలుసుకోవాలంటే మనిషి జీవితం ఏ మాత్రం సరిపోదు, ఈ సృష్టి కొన్ని లక్షల కోట్ల ఏళ్ళ నాటిది. మనిషి జీవితం అందులో అత్యల్పం. అలాంటి మనిషి తాను ఉన్న ఈ అతి తక్కువ సమయంలో తనకు అన్నీ తెలుసు అని విర్రవీగితే అంతకంటే హాస్యాస్పదం వేరొకటి ఉండదు. ఇక్కడ మరో చిత్రం చెప్పుకోవాలి. ఈ సృష్టి క్రమంలో ప్రతీ క్షణంలో ఎన్నో మార్పులు వస్తూంటాయి. వాటిని కనిపెట్టి అవగాహన చేసుకోవడానికి మనిషి అన్న వారెవరికీ సమయం కాలం సరిపోదు.

ఒంటరిగా మిగులుతావు..

ఇక అహంకారానికి పోయే వారి తీరు చూస్తే వారు ఎపుడూ ఒంటరిగా ఉంటారు. తాము గొప్పవారిమి అని ఒక కోట కట్టుకుని అందులోనే జీవిస్తూంటారు. పది మందిలో కలవలేరు, అందరితో తమ భావాలను పంచుకోలేరు, నిరంతరం ఎక్కువ తక్కువలను చూస్తూంటారు. వారి మెదడులో నిక్షిప్తం అయి ఉన్న ఈ ఇగో భావజాలంతో తూనికలు కొలతలు వేసుకుంటూ తమకు సరిసాటి ఎవరూ లేరని అందరూ తక్కువే అని భ్రమలలో గడిపేస్తూంటారు. అలాంటి వారు జీవితంలో ఎంత ఎదిగినా ఎవరూ లేని వారుగా ఏమీ కాని వారుగా ఉండిపోతారు.

ప్రకృతిలో పాలపిట్టను స్వేచ్ఛగా ఎగరనిద్దాం!

పచ్చని పొలాలపై నీలి రెక్కలతో విహరించే పాలపిట్ట ప్రకృతి అందానికి ప్రతీక. పర్యావరణ సమతౌల్యంలోనూ తనదైన పాత్ర పోషించే ఈ పక్షి తెలంగాణ రాష్ట్ర పక్షిగా ప్రత్యేక గుర్తింపు పొందింది. అటువంటి జీవిని కాపాడుకోవాల్సిన మనమే.. అదృష్టం కలిసివస్తుందనే నమ్మకంతో బంధిస్తే అంతకంటే విషాదం ఏముంటుంది? ప్రకృతిని ప్రేమించడం అంటే దాని సౌందర్యాన్ని ఆస్వాదించడమే కాదు.. అందులోని ప్రతి జీవి మనుగడకు తోడ్పడటం కూడా. పాలపిట్టను బోనులో పెట్టకుండా, సహజ ఆవాసాల్లో స్వేచ్ఛగా విహరించేలా చూడటమే నిజమైన ప్రకృతి ప్రేమకు నిదర్శనం.



విజయదశమి అనగానే కొత్త దుస్తులు, ఆలయ సందర్శనలు, జమ్మి చెట్టు పూజలు, బంధు మిత్రుల ఆత్మీయ పలకరింపులు గుర్తుకొస్తాయి. జమ్మి ఆకులను పరస్పరం ఇచ్చుకుంటూ ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలుపుకోవడం తెలంగాణాలో తరతరాలుగా కొనసాగుతున్న ఆనవాయితీ. ఈ వేడుక ల్లో శుభసూచకంగా భావించే పాలపిట్టను దర్శించుకోవడమూ భాగమైంది. పల్లెల్లో పొలాల గట్లపై నా, చెట్ల కొమ్మలపైనా సహజంగా కనిపించే ఈ పక్షి.. నగరాలు, పట్టణాల్లో నివసించేవారికి అంత సులభంగా కనబడదు. ఈ కొరతను అవకాశంగా మలచుకుంటున్న కొందరు వీటిని పట్టుకుని ఉత్స వాల వద్దకు తీసుకొచ్చి, చూపించినందుకు డబ్బు లు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు కలవరపెడుతున్నాయి. శుభం కోసం చేసే పని మరో ప్రాణికి శాపంగా మారడం ఎంతటి వైపరీత్యం!

ఆచారం పేరుతో జరిగే ప్రతి చర్యా సమర్థనీయం కాదు. సంప్రదాయాలు సమాజానికి సాంస్కృతిక గుర్తింపునిస్తాయి. అయితే, వాటి ఆచరణలో మానవీయ విలువలకు భంగం కలిగితే ఆలోచించాల్సిందే. పాలపిట్టను చూస్తే మేలు జరుగుతుందనే విశ్వాసం కొందరిలో ఉండవచ్చు. అందుకోసం దాన్ని బంధించడం, రెక్కలను దెబ్బతీయడం, జన సమ్మర్థం మధ్య ప్రదర్శించడం మాత్రం ఏ విధంగానూ తగదు. ఆకాశంలో స్వేచ్ఛగా ఎగరాల్సిన పక్షిని కదలలేని స్థితిలో ఉంచి, దాని బాధను మన పండుగ వినోదంలో భాగం చేయడం సంస్కారం అనిపించుకోదు. ఒక జీవి స్వేచ్ఛను హరించి పొందే సంతోషం కంటే దాని సహజ జీవనాన్ని కాపాడటంలోనే నిజమైన ఆనందం ఉంది.

పాలపిట్టను దర్శిస్తే శుభం కలుగుతుందనే నమ్మకానికి తోడు, రామాయణంలో శ్రీరాముడు, మహాభారతంలో ధర్మరాజు యుద్ధానికి వెళ్లే ముందు ఈ పక్షిని చూశారనే కథనాలూ ప్రచారంలో ఉన్నాయి. వీటికి ప్రామాణికమైన చారిత్రక లేదా శాస్త్రీయ ఆధారాలు ఉన్నట్లు నిర్ధారణ లేదు. ఒక కథ కాలంగా ప్రచారంలో ఉన్నంత మాత్రాన అది నిరూపితమైన వాస్తవం కాజాలదు. విశ్వాసం వ్యక్తిగతమైనది కావచ్చు, కానీ దాని పేరుతో మరో ప్రాణిని హింసించే హక్కు ఎవరికీ లేదు. పక్షిని చూడాలనుకునేవారు సహజ ఆవాసాలకే వెళ్లవచ్చు. అంతేగానీ, తమ ముందుకు తీసుకురావాలనే కోరికతో స్వేచ్ఛను హరించడంలో ఔచిత్యం లేదు.

ఇక్కడ మరో కోణాన్నీ విస్మరించరాదు. పాలపిట్ట కేవలం పండుగ నాడు దర్శించుకోవాల్సిన శుభసూచకం మాత్రమే కాదు, అది పర్యావరణ వ్యవస్థలో భాగమైన జీవి. పంట పొలాల్లోని కీటకాలను ఆహారంగా తీసుకుంటూ పర్యావరణ సమతౌల్యానికి తోడ్పడుతుంది. చెట్లు, పొలాలు, సహజ ఆవాసాల పరిరక్షణ దాని మనుగడకు అవసరం. అలాంటి పక్షులను బంధించి ప్రదర్శించడం వాటి స్వేచ్ఛను హరించడమే కాకుండా, వన్యప్రాణుల పట్ల సమాజంలో ఉండాల్సిన గౌరవాన్ని కూడా



దెబ్బతీస్తుంది. జీవవైవిధ్యాన్ని కాపాడుకోవాల్సిన తరుణంలో, మన రాష్ట్ర పక్షికే రక్షణ కరవవడం ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన పరిస్థితి.

ఈ దుస్థితికి అడ్డుకట్ట వేయడంలో ప్రభుత్వ యంత్రాంగంతోపాటు ప్రజలకూ కీలక బాధ్యత ఉంది. వన్యప్రాణి సంరక్షణ చట్టం, 1972 ప్రకారం పాలపిట్టకు రక్షణ ఉంది. దానిని పట్టుకోవడం, వేటాడడం, చట్టవిరుద్ధంగా స్వాధీనంలో ఉంచుకోవడం వంటి చర్యలు నేరాల పరిధిలోకి వస్తాయి. ఉల్లంఘనలకు పాల్పడేవారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలి. పండుగల సమయంలో పాలపిట్టలను బంధించి ప్రదర్శించే ఘటనలపై అటవీశాఖ అధికారులు నిఘా పెంచాలి. ప్రజలు ఇలాంటి దృశ్యాలను గుర్తిస్తే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలి. అయితే, కేవలం తనిఖీలు, హెచ్చరికలతోనే సమస్య పూర్తిగా పరిష్కారం కాదు. పక్షులను చూపించడం ద్వారా డబ్బులు సంపాదించవచ్చనే పరిస్థితి ఉన్నంతకాలం ఆ అక్రమానికి తెరపడటం కష్టం. అందువల్లవాటిని చూసేందుకు డబ్బులు చెల్లించే ధోరణికి ప్రజలు స్వస్తి పలకాలి. డిమాండ్ తగ్గితే ఇలాంటి చర్యలకు లభించే ప్రోత్సాహమూ తగ్గుతుంది.

పిల్లల్లో ప్రకృతి పట్ల ప్రేమను పెంపొందించడం కూడా ఈ సమస్యకు దీర్ఘకాలిక పరిష్కారం. నగరాల్లో నివసించే కుటుంబాలు దసరా సెలవుల్లో పల్లె ప్రాంతాలకు వెళ్లి, పొలాల వద్ద సహజంగా సంచరించే పాలపిట్టలను దూరం నుంచి గమనించవచ్చు. వాటి జీవన విధానం గురించి పిల్లలకు వివరించవచ్చు. చెట్లు పెంచడం ద్వారా పక్షులకు ఆవాసాలు కల్పించవచ్చని, ప్రకృతిని కాపాడటం ద్వారా జీవజాల మనుగడకు తోడ్పడవచ్చని తెలియజేయాలి. బోనులో బందీగా ఉన్న పక్షిని చూపించడం కంటే, నీలి రెక్కలు విప్పి ఆకాశంలో విహరిస్తున్న దృశ్యాన్ని పరిచయం చేయడం ఎంతో విలువైన పాఠం అవుతుంది. ప్రకృతిని ఆస్వాదించడానికి దాన్ని బంధించాల్సిన అవసరం లేదనే భావన బాల్యంలోనే అలవడాలి.

విజయదశమి చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీక. ఆ స్ఫూర్తి మన ప్రవర్తనలోనూ ప్రతిఫలించాలి. మూఢనమ్మకాలను ప్రశ్నించడం, మూగజీవాల పట్ల కరుణ చూపడం, పర్యావరణాన్ని పరిరక్షించడం కూడా మంచి లక్షణాలే. సంప్రదాయాన్ని కాపాడుతున్నామనే పేరుతో క్రూరత్వాన్ని కొనసాగించడం తగదు. కాలంతోపాటు ఆచరణలో మార్పులు రావాలి. పండుగలోని ఆత్మీయతను నిలుపుకొంటూనే, జీవుల స్వేచ్ఛకు భంగం కలిగించే పద్ధతులను విడనాడాలి. అప్పుడే మన సంస్కృతి మరింత ఉన్నతంగా నిలుస్తుంది.


పాలపిట్టను చూడటం వల్ల అదృష్టం వస్తుందో లేదో పక్కనపెడితే, దాని స్వేచ్ఛను కాపాడటం మాత్రం మన చేతుల్లోనే ఉంది. మన ఆనందం కోసం మరో జీవి బాధపడకూడదనే కనీస స్పృహ సమాజంలో పెరగాలి. పక్షులను బంధించేవారిని నిరుత్సాహపరచాలి. వాటి సహజ ఆవాసాలను కాపాడాలి. అక్రమాలను అధికారుల దృష్టికి తీసుకెళ్లాలి. పండుగ సంప్రదాయాన్ని పాటించడంలో చూపే ఉత్సాహంలో కొంతైనా ప్రకృతి రక్షణపైనా చూపాలి.

పాలపిట్టను బంధించి అదృష్టాన్ని వెతకడం కాదు.. దాని స్వేచ్ఛను కాపాడటంలోనే మన సంస్కారాన్ని చాటుకోవాలి. ఈ విజయదశమి నాడు ఆ పక్షిని బోనులో కాకుండా నీలాకాశంలో చూద్దాం. ప్రకృతిని కాపాడుదాం.. మూగజీవాల మనుగడకు అండగా నిలుద్దాం. అదే పండుగ స్ఫూర్తికి నిజమైన ప్రతిబింబం.

గడగోజు రవీంద్రచారి,
9848772232

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
మంగళవారం 20.10.2026
www.mudranews.in | @mudranews

రాచ, బూడిద గుమ్మడి దేనికి ఉపయోగిస్తారు?



దసరా సమయంలో రాచ గుమ్మడి, బూడిద గుమ్మడికాయలను సంప్రదాయ ఆచారాల కోసం ఉపయోగిస్తారు. కొన్ని ప్రాంతాల్లో రాచ గుమ్మడితో దిష్టి తీసి కొడుతుండగా, మరికొన్ని చోట్ల బూడిద గుమ్మడికాయను ఇంటి ముందు ఉంచడం లేదా కొట్టడం చేస్తారు. ప్రాంతాన్ని బట్టి ఈ ఆచారాల్లో మార్పులు కనిపిస్తాయి.

ఆస్ట్రేలియా గడ్డపై 6వేల మందితో..

అంగరంగ వైభవంగా బతుకమ్మ వేడుకలు



ముద్ర, మెల్బోర్న్: తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అయిన బతుకమ్మ పండుగను ఆస్ట్రేలియా తెలంగాణ అసోసియేషన్ ఆధ్వర్యంలో 13 సంవత్సరాలుగా ఆస్ట్రేలియాలో ఘనంగా నిర్వహి స్తున్న విషయం తెలిసిందే. ఈ ఏడాది మెల్బోర్న్ నగరంలో ఏకంగా 6000 మందికి పైగా తెలంగాణ బిడ్డల సమక్షంలో బతుకమ్మ వేడుకలను అత్యంత వైభవంగా, ఘనంగా నిర్వహించారు. పూలతో గౌరమ్మను పేర్చి, ఆటపాటలతో ఆడబిడ్డలంతా కలిసి ఆస్ట్రేలియా గడ్డపై తెలంగాణ సంస్కృతిని చాటిచెప్పారు. ఆస్ట్రేలియా బీఆర్ఎస్ ఎన్ఆర్ ఐ నాయకుడు అనిల్ బైరెడ్డి మాట్లాడుతూ..''ఆస్ట్రేలియా గడ్డపై మన తెలంగాణ సంప్రదాయాన్ని, బతుకమ్మ సంస్కృతిని గత 13 సంవత్సరాలుగా కొనసాగిస్తూ వస్తున్నందుకు చాలా సంతోషంగా ఉంది. అందులో మొట్టమొదటిగా ఈ సంఘాన్ని నేను స్థాపించినందుకు నాకు ఎంతో గర్వంగా, ఆనందంగా ఉంది. ప్రవాసంలో ఉన్నా మన సంస్కృతిని మరిచిపోకుండా ఇంత పెద్ద ఎత్తున తరలివచ్చిన ప్రతి ఒక్క తెలంగాణ బిడ్డకు నా హృదయపూర్వక కృతజ్ఞతలు'' అని తెలియజేశారు. ఆస్ట్రేలియా బీఆర్ఎస్ ఎన్ఆర్ ఐ నాయకురాలు కిరణ్ పాల్వాయి మాట్లాడుతూ..''ఇంత అంగరంగ వైభవంగా బతుకమ్మ సంబరాలను జరుపుకోవడం చాలా సంతోషంగా ఉంది. ఈ వేడుకలకు ఇంత పెద్ద ఎత్తున తరలివచ్చి, బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న ప్రతి ఒక్క తెలంగాణ బిడ్డకు పేరు పేరునా హృదయపూర్వక కృతజ్ఞతలు, ధన్యవాదాలు. ఇక్కడికి వచ్చిన మన తెలంగాణ బిడ్డలందరికీ అనుకూలంగా ఉండేలా, మన తెలంగాణ పిండి వంటలు, సంప్రదాయ వంటకాలన్నీ ప్రత్యేకంగా ఏర్పాటు చేసి అందరికీ అందించడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి కోడలు ప్రీతి రెడ్డి పాల్గొనడం విశేషం. ఆమె బతుకమ్మ వేడుకల్లో పాల్గొని ఆడబిడ్డలతో కలిసి బతుకమ్మ ఆడి, అందరికీ బతుకమ్మ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ వేడుకలను విజయవంతం చేయడంలో ఆస్ట్రేలియా తెలంగాణ అసోసియేషన్ సభ్యులు రాజ్ వుల్పాల, పుల్లా రెడ్డి, వంశీ కొట్టాల, మహేష్ బద్దం, ప్రవీణ్ దేశం, అమర్ అత్తాపురం, కృష్ణ వాడియాల, రవి దామెర, దీపక్, రఘు కొట్లా, మధు పర్సా, మధు పైళ్ల, రమేష్ ముత్యాల, సత్య గుండ, శ్యామ్, కార్తీక్, శ్రీకాంత్ నంగునూరి, రాజేష్, ఫణి, సతీష్, పరి, కర్ర శ్రీనివాస్, కిషోర్ యన్నం తదితరులు కృషి చేశారు.


మణిపూర్ హింసాకాండలో నలుగురు మృతి

సీఎం నివాసం వద్ద మృతదేహాలతో నిరసన

ముద్ర, ఇంఫాల్: మణిపూర్‌లో హింసాకాండ కొనసాగుతున్నది. రెండు చోట్ల జరిగిన కాల్పుల్లో నలుగురు మరణించారు. ఆగ్రహించిన స్థానికులు మృతదేహాలను సీఎం నివాసం వద్దకు తరలించి నిరసన తెలిపారు. తాజా హింసాత్మక ఘటనలతో మణిపూర్‌లో భద్రతా పరిస్థితి మరింత దిగజారింది. (Manipur Violence) మొదటి ఘటనలో మైతేయి ప్రజలు, పాంగల్ ముస్లింలు నివసించే ప్రాంతంలో ఒక సంగీత కార్యక్రమం జరుగుతుండగా హింస చెలరేగింది. రాళ్ల దాడి, కాల్పులు జరుగడంతో పలువురు గాయపడ్డారు. బుల్లెట్ గాయాలైన 24 ఏళ్ల యువకుడు మరణించాడు.కాగా, ఇంఫాల్ తూర్పు జిల్లాలోని ఖమెన్‌లోక్ ప్రాంతంలో మరో హింసాత్మక ఘటన జరిగింది. సమీపంలోని కొండల్లో కట్టెల కోసం వెళ్లిన ముగ్గురు గ్రామస్తులను, కుకీ గిరిజన మిలిటెంట్లుగా అనుమానించిన వ్యక్తులు కాల్చి చంపారు. ఈ కాల్పుల్లో మరో ముగ్గురు వ్యక్తులు కూడా గాయపడ్డారు.అయితే ఈ హత్యలపై గ్రామస్తులు తీవ్ర ఆగ్రహానికి గురయ్యారు. కట్టుదిట్టమైన భద్రత ఉన్న ఇంఫాల్‌లోని ముఖ్యమంత్రి నివాసానికి మృతదేహాలను తరలించి నిరసన చేపట్టగా పోలీసులు వాటిని బలవంతంగా తొలగించారు. ఆందోళనకారును చెదరగొట్టేందుకు బాష్పవాయువు ప్రయోగించడంతో పాటు లాఠీఛార్జ్ చేశారు.మరోవైపు రాజ్ మెడిసిటీ



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారిని ముఖ్యమంత్రి యుమ్నం ఖేమ్‌చంద్ సింగ్ పరామర్శించారు. సమీపంలోని ఎస్‌వోవో శిబిరాన్ని తొలగించడంతో సహా



తక్షణ చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే తోక్చోమ్ లోకేశ్వర్ సింగ్ డిమాండ్ చేశారు. ఈ హత్యల నేపథ్యంలో నిరసనలు వెల్లువెత్తడంతో ఇంఫాల్ నగరం దాదాపు స్తంభించింది.

జమ్ముకశ్మీర్ బస్సుపై రాళ్లతో దాడి

డ్రైవర్‌ను ఉగ్రవాదిగా పేర్కొన్న వ్యక్తులు


ముద్ర, న్యూఢిల్లీ: జమ్ముకశ్మీర్‌కు చెందిన ప్రైవేట్ ట్రావెల్స్ బస్సుపై ఇద్దరు వ్యక్తులు రాళ్లతో దాడి చేశారు. ఆ బస్సు డ్రైవర్‌ను ఉగ్రవాదిగా పేర్కొన్నారు. ఉగ్రవాద వాహనానికి నిప్పుపెడతామని, ప్రయాణికులను చంపుతామని వారు బెదిరించారు. ఈ దాడిలో బస్సు అద్దాలు ధ్వంసం కావడంతో ఒక ప్రయాణికుడు గాయపడ్డాడు. అక్టోబర్ 17న రాత్రి 10.30 గంటల సమయంలో ఢిల్లీ నుంచి శ్రీనగర్ వెళ్తున్న ఒక ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు, ప్రయాణికుల భోజనం కోసం హర్యానాలోని కర్నాల్ జిల్లాలో ఒక ధాబా వద్ద ఆగింది. అక్కడ ఒక కారు కూడా పార్క్ చేసి ఉన్నది.కాగా, ఆ కారులోని ఇద్దరు వ్యక్తులు, బస్సు ప్రయాణికుడి మధ్య వాగ్వాదం జరిగింది. ఈ నేపథ్యంలో జమ్ముకశ్మీర్ రిజిస్ట్రేషన్ ఉన్న బస్సును ఉగ్రవాద వాహనంగా, డ్రైవర్‌ను ఉగ్రవాదిగా వారు పేర్కొన్నారు. 'ఈ ఉగ్రవాద వాహనాన్ని ఇక్కడి నుంచి తీసివేయండి' అని అరిచారు. ఆ బస్సు అక్కడి నుంచి వెళ్లిపోవాలని వారు డిమాండ్ చేశారు. అయితే బస్సు డ్రైవర్ ప్రశ్నించగా ఆ ఇద్దరు వ్యక్తులు మరింతగా రెచ్చిపోయారు. బస్సుపైకి రాళ్లు, ఇటుకలు విసిరారు. బస్సులోని వారిని కాల్చివేస్తామని, బస్సుకు నిప్పు పెడతామని, వారిని చంపేస్తామని బెదిరించారు. జమ్ముకశ్మీర్ రిజిస్ట్రేషన్ ఉన్న వాహనం హర్యానాలో ఉండటాన్ని మరికొందరు వ్యతిరేకించారు. ఈ రాళ్ల దాడిలో బస్సు కిటికీ అద్దాలు ధ్వంసమయ్యాయి. వృద్ధుడైన ఒక ప్రయాణికుడు గాయపడ్డాడు. ఈ సంఘటన తర్వాత ఆ బస్సు అక్కడి నుంచి బయలుదేరింది. మరోవైపు జమ్ముకశ్మీర్ బస్సుపై హర్యానాలో దాడి జరిగిన వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. దీంతో కశ్మీరీ



ప్రయాణికుల పట్ల శత్రుత్వంతో ఈ దాడి జరిగిందా అన్న దానిపై విచారణ జరుపాలని పలువురు డిమాండ్ చేశారు. జమ్ముకశ్మీర్ సీఎం ఒమర్ అబ్దుల్లా కూడా స్పందించారు. ఈ సంఘటన దురదృష్టకరమని పేర్కొన్నారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని హర్యానా ప్రభుత్వం, ఆ రాష్ట్ర పోలీసులను ఎక్స్ పోస్ట్‌లో ఆయన కోరారు. ఈ పరిణామాల నేపథ్యంలో హర్యానా పోలీసులు స్పందించారు. జమ్ముకశ్మీర్ బస్సుపై దాడి చేసిన వారిని మోహిత్, సావన్‌గా గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. పార్కింగ్, దారి విషయంలో జరిగిన వివాదమే ఈ దాడికి కారణమని, మతపరమైన దాడి కాదని పోలీస్ అధికారి తెలిపారు. ఈ సంఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని చెప్పారు.అయినప్పటికీ సుమోటోగా పరిగణించి నిందితులపై చర్యలు చేపట్టినట్లు పోలీస్ అధికారి వివరించారు. బస్సుకు జరిగిన నష్టానికి పరిహారం చెల్లించడానికి యువకులు అంగీకరించడంతో ఇరుపక్షాలు రాజీకి వచ్చాయని అన్నారు. 'ఇది మత సంబంధమైన విషయం కాదు. శాంతి కోసం మేం విజ్ఞప్తి చేస్తున్నాం' అని ఆ పోలీస్ అధికారి స్పష్టం చేశారు.

గర్బా వేడుక వద్ద బాలికపై బీజేపీ నేత అసభ్యకర ప్రవర్తన

వీడియో వైరల్.. పోక్సో కేసు నమోదు



ముద్ర, భోపాల్: గర్బా వేడుకలో పాల్గొనేందుకు వచ్చిన బాలిక పట్ల ఒక బీజేపీ నేత అసభ్యకరంగా ప్రవర్తించారు. ఆమెను దూషించడంతో పాటు బయటకు తోసివేశారు. ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. ఆ బాలిక ఫిర్యాదుతో ఆ బీజేపీ నేతపై కేసు కూడా నమోదైంది. బీజేపీ పాలిత మధ్యప్రదేశ్‌లో ఈ సంఘటన జరిగింది. ఆదివారం సాయంత్రం ఇండోర్‌లోని హీరా నగర్ ప్రాంతంలో 'కంకేశ్వరి గర్బా ఉత్సవం' నిర్వహించారు. ఈ వేడుకలో పాల్గొనేందుకు 15 ఏళ్ల బాలిక అక్కడకు చేరుకున్నది. కాగా, బీజేపీ మండల అధ్యక్షుడు కమల్ చౌహాన్, ఆ బాలిక పట్ల అనుచితంగా ప్రవర్తించారు. వేదికలోకి ఆమె ప్రవేశించడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. పండాల్ నుంచి బయటకు వెళ్లమని చెబుతూ ఆ బాలికను బలవంతంగా నెట్టివేశారు. ప్రతిస్పందించిన ఆమె తనను తాక వద్దని ఆయనను హెచ్చరించింది. అక్కడున్న కొందరు జోక్యం చేసుకుని సర్దిచెప్పారు. ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. దీంతో బీజేపీ మండల అధ్యక్షుడు కమల్ చౌహాన్ ప్రవర్తనపై విమర్శలు వెల్లువెత్తాయి. మరోవైపు ఈ సంఘటన జరిగిన కొన్ని గంటలకే ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ 'కంకేశ్వరి గర్బా' వేదికను సందర్శించారు. కన్యా పూజలో ఆయన పాల్గొనడంతో ఈ వ్యవహారం రాజకీయ రంగు పులుముకుంది. దీంతో బీజేపీపై కాంగ్రెస్ మండిపడింది. ముఖ్యమంత్రి చిన్న బాలికలకు పూజలు చేస్తుంటే, అదే వేదిక వద్ద ఒక మైనర్ బాలిక పట్ల ఆ పార్టీ నేత దురుసుగా ప్రవర్తించడాన్ని విమర్శించింది. ఆయనను బీజేపీ నుంచి బహిష్కరించాలని డిమాండ్ చేసింది. అయితే ఆ బాలిక కూడా బీజేపీ నేత కమల్ చౌహాన్‌పై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ నేపథ్యంలో పోక్సో చట్టంతో పాటు పలు సెక్షన్ల కింద ఆయనపై కేసు నమోదు చేశారు. ఈ పరిణామాల నేపథ్యంలో కమల్ చౌహాన్‌పై క్రమశిక్షణ చర్యలు చేపడతామని బీజేపీ పేర్కొంది.

చెన్నెలో వర్ష బీభత్సం.. పలు జిల్లాలకు 'ఆరెంజ్ అలర్ట్'

ముద్ర, చెన్నె: తమిళనాడును భారీ వర్షాలు ముంచెత్తుతున్నాయి. భారీ వర్షాలకు రోడ్లన్నీ జలమయమయ్యాయి. వాహనదారులు తీవ్రంగా ఇబ్బంది పడ్డారు. శనివారం సాయంత్రం నుంచి అర్ధ రాత్రి వరకు చైన్నెతో పాటు రాష్ట్రవ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో వాతావరణ శాఖ చెన్నె, తిరుచిరాపల్లి, కోయంబత్తూరు, నీలగిరి జిల్లాలకు సోమవారం 'ఆరెంజ్ అలర్ట్' జారీచేసింది. ఈ నాలుగు జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని అధికారులు హెచ్చరించారు. రాష్ట్రంలోని ఉత్తర, పశ్చిమ, మధ్య, దక్షిణ ప్రాంతాల్లో వర్షాల తీవ్రత ఎక్కువగా ఉండనుంది. ధర్మపురి, కృష్ణగిరి, సేలం, తిరువళ్లూరు, దిండిగల్, తేని, విరుదునగర్, తెన్కాశి, తిరునెల్వేలి, కన్యాకుమారి, తూత్తుకుడి జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ కేంద్రం వెల్లడించింది. వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అవసరమైతే తప్ప బయటకు రావొద్దన్నారు.

వర్షపాతం వివరాలు..

ప్యారిస్ 36 సెం.మీ, కత్తివాక్కం 34, చెన్నె సెంట్రల్ 27, సాత్తాంకాడు 26, తిరువొట్రియూర్, ఎన్నూర్ 22, ఎంజీఆర్ నగర్ 19, సీడీ ఆస్పత్రి తండయార్‌పేట, పెరంబూర్ 18, తండయార్‌పేట 17, వడపళని, చెన్నె కలెక్టరు కార్యాలయం 16, బేసిన్‌బ్రిడ్జ్, నుంగంబాక్కం, వైఎంసీఏ నందనం, ఆలందూర్ 15, ఐస్‌హౌస్, అన్నా వర్సిటీ, సెమ్మేడు (విళుపురం) 14, వాలాజా (రాణిపేట), మీనంబాక్కం, మాధవరం 1 సెం.మీ, మణలి, మడిప్పాక్కం, మణలి న్యూటౌన్, సోలిగ్రామం, వలసరవాక్కం, రెడ్‌హిల్స్, మనంపూండి (విళుపురం), గుమ్మిడిపూండి, మరక్కానం (విళుపురం) 12 సెం.మీ వర్షపాతం నమోదైంది.

మాజీ విద్యార్థినికి అనుచిత మెసేజ్‌లు

ముద్ర, నాగపూర్: సింబయాసిస్ యూనివర్సిటీకి చెందిన నాగపూర్ క్యాంపస్‌లోని ఓ ప్రొఫెసర్‌పై వేటు పడింది. ఆ క్యాంపస్‌లో చదువుకున్న మాజీ విద్యార్థినికి.. ప్రొఫెసర్ అనుచిత మెసేజ్‌లు చేసినట్లు తేలింది. ఇస్లామిక్ మత విధానాలను ఫాలో అవ్వాలని ఆ ప్రొఫెసర్ తన మెసేజ్‌ల్లో కోరినట్లు గుర్తించారు. దీంతో అతన్ని బలవంతపు లీవ్‌పై పంపినట్లు తెలుస్తోంది. ప్రొఫెసర్ ప్రవర్తన గురించి తెలుసుకున్న విద్యార్థి సంఘాలు ఆందోళన చేపట్టాయి. ఈ ఆరోపణలపై దర్యాప్తు చేపట్టేందుకు హైపవర్ కమిటీని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అయితే సదరు ప్రొఫెసర్ ఇప్పటికే తన పోస్టుకు రాజీనామా చేసినట్లు కొన్ని వర్గాల ద్వారా తెలుస్తోంది. అయితే ఈ ఘటనలో ఎటువంటి కేసు నమోదు కాలేదు. ఆరు నెలల క్రితమే ఆ స్టూడెంట్ వర్సిటీ వదిలి వెళ్లింది. నాగపూర్ సిటీ పోలీసులు రిక్వెస్ట్ చేసినా ఆమె ఫిర్యాదు ఇవ్వలేదు. ఆమె తండ్రి కూడా ఫిర్యాదుకు నిరాకరించాడు. ఆ అనుచిత మెసేజ్‌లకు చెందిన ఆధారాలను చూపెట్టలేకపోయారు. అసభ్యకరమైన మెసేజ్‌లే కాకుండా.. ఇస్లామిక్ మత ఆచారాలను ఫాలో అవ్వాలంటూ విద్యార్థిని సదరు ప్రొఫెసర్ ఎంకరేజ్ చేసినట్లు తెలుస్తోంది. ప్రొఫెసర్‌కు వ్యతిరేకంగా ఏబీవీపీ, వీహెచ్‌పీ ఆందోళన చేపట్టాయి.

టైగర్ ష్రాఫ్‌పై కాల్పులు..



తీవ్రంగా గాయపడిన డ్రైవర్

ముద్ర, ముంబై : బాలీవుడ్ నటుడు టైగర్ ష్రాఫ్‌పై కాల్పులు జరగడం దేశవ్యాప్తంగా సంచలనం రేపింది. ఆదివారం సాయంత్రం ముంబైలోని జుహు ప్రాంతంలో కారులో వెళ్తుండగా ముగ్గురు బైక్‌పై వచ్చి కాల్పులు జరిపారు. ఈ దాడిలో కారు డ్రైవర్‌తో పాటు ఆటోడ్రైవర్ కూడా గాయపడ్డాడని పోలీసులు తెలిపారు. డ్రైవర్ పరిస్థితి విషమంగా ఉన్నట్టు తెలుస్తున్నది. నటుడు టైగర్‌ష్రాఫ్ క్షేమంగా ఉన్నాడని, అతనికి ఎలాంటి గాయాలు కాలేదని పోలీసులు తెలిపారు. ఆ దుండగులు ఎవరు అనే కోణంలో సీసీ ఫుటేజ్ ఆధారంగా పోలీసులు ఆరా తీస్తున్నారు. అయితే ఈ కాల్పులు జరిపింది తామే అని బిష్ణోయ్ గ్యాంగ్‌కు చెందిన అనిల్ పండిత్, హర్మన్ సంధుల పేరుతో సోషల్ మీడియాలో పోస్టులు వైరల్ అవుతున్నాయి. ఈ ఘటనపై సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ దర్యాప్తునకు ఆదేశించారు.

అసలు నన్నెందుకు టార్గెట్ చేశారో అర్థం కావట్లేదు : టైగర్ ష్రాఫ్

తనను ఎందుకు టార్గెట్ చేశారో అర్థం కావడంలేదని, గతంలో తనకు ఎలాంటి బెదిరింపులు కూడా రాలేదని, ఎవరితోనూ తనకు శత్రుత్వం లేదని టైగర్ ష్రాఫ్.. మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ శిండేతో టైగర్ ష్రాఫ్ చెప్పినట్లు సమాచారం. సాధారణంగా వారాంతాల్లో ఫుట్‌బాల్ ఆడిన తర్వాత అభిమానులతో టైగర్ ష్రాఫ్ ఫొటోలు దిగుతుంటారు. ఆదివారం అలసటగా అనిపించడంతో అభిమానులతో ఫొటోలు దిగలేదట. ఈ నిర్ణయం తనను ప్రమాదం నుంచి తప్పించిందని శిండేతో చెప్పినట్లు సమాచారం. అలాగే లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్, నటుడు సల్మాన్ ఖాన్‌కు సంబంధించిన వ్యవహారాలతో తనకు ఎలాంటి సంబంధం లేదని, తనను ఎందుకు లక్ష్యంగా చేసుకున్నారో తెలియడం లేదని టైగర్ పేర్కొన్నట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. ఇదిలావుంటే కాల్పుల అనంతరం ఆదివారం రాత్రి టైగర్ ష్రాఫ్‌ను పరామర్శించిన ఏక్‌నాథ్ శిండే ఆయన కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఆయనకు వ్యక్తిగత భద్రతా సిబ్బందిని ఏర్పాటు చేయడంతోపాటు, ఆయన నివాసం వద్ద పోలీసు భద్రతను పెంచే చర్యలు చేపట్టనున్నట్లు శిండే చెప్పారని సంబంధిత వర్గాలు తెలిపాయి. కాగా టైగర్ ష్రాఫ్‌పై కాల్పులకు పాల్పడిన నిందితులను రాజస్థాన్ పోలీసులు పకడ్బందీగా అదుపులోకి తీసుకున్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
మంగళవారం 20.10.2026
www.mudranews.in | @mudranews

గుమ్మడికాయతో దిష్టి పోతుందా? శాస్త్రం ఏం చెబుతోంది?

గుమ్మడికాయ కొట్టడం వల్ల దిష్టి తొలగిపోతుందని, శుభం కలుగుతుందని చాలామంది నమ్ముతారు. అయితే ఒక్క గుమ్మడికాయ కొట్టడం వల్ల ప్రతికూల ప్రభావాలు తొలగిపోతాయని లేదా వంద జంతువుల బలికి సమానమైన ఫలితం లభిస్తుందని నిరూపించే శాస్త్రీయ ఆధారాలు లేవు. సంప్రదాయాలను గౌరవిస్తూనే, వాటి వెనుక ఉన్న వాస్తవాలను తెలుసుకోవడం ముఖ్యమని జన విజ్ఞాన వేదిక నిపుణులు సూచిస్తున్నారు.



తెలంగాణలో ఎల్ నినో పరిస్థితులపై మంత్రివర్గ ఉపసంఘం

ముద్ర, హైదరాబాద్ : ఎల్ నినో పరిస్థితులపై సమీక్షించేందుకు తెలంగాణ ప్రభుత్వం మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేసింది. దీనికి ఛైర్మన్ గా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వ్యవహరించనున్నారు. ఇందులో సభ్యులుగా మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీతక్క, తుమ్మల నాగేశ్వరరావు, వాకిటి శ్రీహరి ఉన్నారు. మంత్రివర్గ ఉపసంఘం ప్రత్యేక ఆహ్వానితుడిగా సీఎం సలహాదారు రామకృష్ణారావును నియమించారు. దీనికి కన్వీనర్ గా ప్రణాళిక శాఖ కార్యదర్శి వ్యవహరించనున్నారు. ఈ సబ్ కమిటీ ఎల్ నినోపై సమీక్షించి ఎప్పటికప్పుడు ఆదేశాలు, సూచనలు ఇవ్వనుంది.

బతుకమ్మ వేడుకల నిర్వహణలో నగరపాలక సంస్థ విఫలం

ముద్ర, కరీంనగర్ : తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కేసీఆర్ పాలనలో బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారని, అయితే ఈ ఏడాది నగర పాలక సంస్థ ఆ వేడుకల నిర్వహణలో పూర్తిగా విఫలమైందని మాజీ కార్పొరేటర్ చల్లా హరిశంకర్ ఆరోపించారు. సోమవారం కరీంనగర్‌లోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కరీంనగర్‌లో ఆదివారం సద్దుల బతుకమ్మ వేడుకలను చీకటిలో నిర్వహించారని, బతుకమ్మల నిమజ్జనానికి నీటి సౌకర్యం కల్పించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వీటన్నింటికి నగర పాలక సంస్థ.. ప్రజలకు సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.



కలెక్టరేట్ ప్రజావాణికి 44 దరఖాస్తులు

ముద్ర, కరీంనగర్: కరీంనగర్ నూతన కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 44 దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు. వీటిలో మున్సిపల్ కార్పొరేషన్‌కు సంబంధించి 19, రెవెన్యూ శాఖకు 14, ఇతర శాఖలకు 11 దరఖాస్తులు వచ్చాయి. ప్రజావాణిలో అందిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి, వీలైనంత త్వరగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ చిత్ర మిశ్రా అధికారులను ఆదేశించారు. ప్రజల సమస్యల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యం వహించకూడదని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి తదితర అధికారులు పాల్గొన్నారు.

డీలిమిటేషన్‌పై కాంగ్రెస్‌కు కేంద్రం షాక్

ముద్ర, న్యూఢిల్లీ: డీలిమిటేషన్ బిల్లుపై చర్చలకు కాంగ్రెస్ పార్టీ సమయం కేటాయించకపోవడంతో ఇతర రాజకీయ పార్టీలతో సంప్రదింపులు జరిపామని కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు స్పష్టం చేశారు. ఈ మేరకు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు సోమవారం లేఖ రాశారు. డీఎంకే, సమాజ్ వాదీ పార్టీ, వైఎస్సార్ సీపీ, ఎన్సీపీ, శివసేన (యూబీటీ), ఎంఐఎం, బీజేడీ తదితర పార్టీల ప్రతినిధులతో ఇప్పటికే చర్చలు పూర్తయ్యాయని తెలిపారు. ప్రభుత్వం పలుమార్లు చర్చలకు ప్రయత్నించినప్పటికీ కాంగ్రెస్ స్పందించలేదని పేర్కొన్నారు. కీలక బిల్లులపై ప్రతిపక్షాలు నిర్మాణాత్మక సహకారం అందించాలని, పార్లమెంటులో అర్థవంతమైన చర్చలకు అవకాశం కల్పించాలని కోరారు. కాగా, లోక్ సభ స్థానాల సంఖ్యను 50 శాతం పెంచడంతోపాటు మహిళా రిజర్వేషన్ల అమలుకు సంబంధించిన బిల్లుల కోసం ఈ నెలాఖరులో పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు నిర్వహించనున్నట్లు ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో రిజిజు లేఖ రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది.

అభ్యర్థులపై ఫిర్యాదు చేయొచ్చు

ముద్ర, న్యూఢిల్లీ: ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు నామినేషన్ పత్రాలు, అఫిడవిట్లలో తప్పుడు సమాచారం ఇచ్చినా, వాస్తవాలను దాచిపెట్టినా సాధారణ పౌరులు సైతం వారిపై ప్రైవేటు ఫిర్యాదులు దాఖలు చేయవచ్చని సుప్రీంకోర్టు కీలక తీర్పునిచ్చింది. ప్రజాప్రాతినిధ్య చట్టం–1951లోని సెక్షన్ 125A కింద ఇలాంటి ఫిర్యాదులు చేసేందుకు పౌరులకు చట్టపరమైన అర్హత ఉందని జస్టిస్ దీపంకర్ దత్తా, జస్టిస్ శీల్ నాగు ధర్మాసనం స్పష్టం చేసింది. ఈ వ్యవహారంలో ప్రభుత్వ అధికారి మాత్రమే ఫిర్యాదు చేయాలన్న నిబంధన వర్తించదని పేర్కొంది. కర్ణాటకలోని బీదర్ నియోజకవర్గం నుంచి 2023లో ఎన్నికైన ఎమ్మెల్యే డాక్టర్ శైలేంద్ర బెల్దాలే తన నివాస చిరునామా విషయంలో అఫిడవిట్ లో తప్పుడు వివరాలు ఇచ్చారంటూ రాజ్ కుమార్ మడ్కి దాఖలు చేసిన పిటిషన్ పై విచారణ సందర్భంగా ఈ తీర్పు వెలువడింది. గతంలో కర్ణాటక హైకోర్టు కొట్టివేసిన పిటిషన్ పై అప్పీల్ ను విచారించిన సుప్రీంకోర్టు.. అభ్యర్థుల అఫిడవిట్లలో నిజానిజాలను ప్రశ్నించే హక్కు సాధారణ పౌరులకు కూడా ఉంటుందని స్పష్టం చేసింది. ఈ తీర్పు ఎన్నికల ప్రక్రియలో పారదర్శకతను పెంచడంతోపాటు తప్పుడు వివరాలు సమర్పించే అభ్యర్థులకు హెచ్చరికగా నిలవనుంది.

అభిజీత్ దీపే భావోద్వేగ పోస్టు

ముద్ర, న్యూఢిల్లీ: ప్రజల సమస్యల పరిష్కారం కోసం పోరాడుతూ జైలుకు వెళ్లాల్సి వచ్చిందని సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీపే భావోద్వేగ పోస్టు చేశారు. ఎవరి ఒత్తిడి, బలవంతం లేకుండానే స్వచ్ఛందంగా ఉద్యమంలోకి వచ్చానని, ప్రజల కోసం పోరాడాలనే సంకల్పంతోనే ఈ మార్గాన్ని ఎంచుకున్నానని పేర్కొన్నారు. ప్రజా సమస్యలపై పోరాటం చేసే క్రమంలో ఎదురయ్యే ఇబ్బందులు, అరెస్టులు, జైలు జీవితానికి సంబంధించిన అంశాలను తన పోస్టులో ప్రస్తావించారు. అశుతోష్ రాంకా, సౌరవ్ దాస్ అరెస్టుల నేపథ్యంలో అభిజీత్ దీపే చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ప్రజల తరఫున నిలబడాలనే ఉద్దేశంతోనే ఉద్యమంలోకి అడుగుపెట్టానని ఆయన స్పష్టం చేశారు. ఉద్యమాల సమయంలో ఎదురయ్యే సవాళ్లను, వాటిని ఎదుర్కొనేందుకు కార్యకర్తలు సిద్ధంగా ఉండాల్సిన పరిస్థితులను ఈ పోస్టు ప్రతిబింబిస్తోంది.



హైదరాబాద్‌లో హనీ ట్రాప్ కలకలం..

నకిలీ ఖాతాలతో వేల మందికి టోకరా
యువతుల పేర్లతో నకిలీ ఖాతాలు
ప్రైవేట్ ఫొటోలతో బెదిరింపులు.. రూ.25 లక్షలు వసూలు
వెయ్యి మందికి పైగా బాధితులు ఉన్నట్లు గుర్తింపు
విదేశీయులకూ విస్తరించిన హనీ ట్రాప్



ముద్ర, హైదరాబాద్ : సోషల్ మీడియాలో తెలియని వ్యక్తులతో పరిచయాలు ఎంతటి ప్రమాదకరంగా మారుతాయో తెలిపే ఒక సంచలన ఘటన హైదరాబాద్‌లో వెలుగులోకి వచ్చింది. సోషల్ మీడియా వేదికగా అందమైన యువతులంటూ నకిలీ ప్రొఫైల్స్ సృష్టించి, అమాయకులను బుట్టలో వేసుకుంటూ భారీగా వసూళ్లకు పాల్పడుతున్న ఘరానా మోసగాడిని పోలీసులు అరెస్టు చేశారు. చార్మినార్ డిసిపి కిరణ్ వెల్లడించిన వివరాల ప్రకారం.. ఈ కేసుకు సంబంధించిన విస్తుపోయే నిజాలు బయటపడ్డాయి.

ఎలా సాగింది ఈ హనీ ట్రాప్ దందా?

ఈ కేసులో కొండాబత్తుల పవన్ కుమార్ అనే వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. ప్రాథమిక విచారణలో ఇతను బి.టెక్ (B.Tech) డ్రాపవుట్ అని తేలింది. పవన్ సోషల్ మీడియాలో అమ్మాయిల పేర్లతో నకిలీ ఖాతాలను సృష్టించి, అమాయక యువకులను ఆకర్షించేవాడు. వారితో చనువుగా చాటింగ్ చేస్తూ ప్రైవేట్ ఫోటోలు, వీడియోలను సేకరించేవాడు. ఆ తర్వాత వాటిని అడ్డం పెట్టుకుని బాధితులను బ్లాక్‌మెయిల్ చేయడం ప్రారంభించేవాడు. ఎవరికైనా చెబితే ఆ ఫోటోలను సోషల్ మీడియాలో వైరల్ చేస్తానని బెదిరిస్తూ ఇప్పటి వరకు సుమారు రూ. 25 లక్షల రూపాయల వరకు వసూలు చేసినట్లు పోలీసులు గుర్తించారు.

విదేశాలకూ పాకిన వేర్లు.. 1000 మందికి పైగా బాధితులు

ఈ మోసాల పరిధి చూసి పోలీసులు సైతం అవాక్కయ్యారు. దాదాపు 1000 మందికి పైగా వ్యక్తులు ఇతని నకిలీ ఖాతాలతో చాటింగ్ చేసినట్లు తేలింది. వీరిలో ప్రస్తుతం 82 మందికి సంబంధించిన సున్నితమైన ప్రైవేట్ డేటా, ఫోటోలు, వీడియోలు నిందితుడి వద్ద ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. విశేషం ఏంటంటే.. బాధితులలో కేవలం స్థానికులు మాత్రమే కాకుండా, ఇతర రాష్ట్రాలకు చెందిన వారు , పాకిస్తాన్, కెనడా, టర్కీ వంటి విదేశీ దేశాల వారు కూడా ఉండటం గమనార్హం.

పోలీసుల హెచ్చరికలు.. అప్రమత్తంగా ఉండాలని సూచన

సోషల్ మీడియాను నమ్మి ఈ విధంగా మోసపోతున్న వారి ఉదంతాలు పెరుగుతున్న నేపథ్యంలో చార్మినార్ డిసిపి కిరణ్ ప్రజలకు కీలక హెచ్చరికలు జారీ చేశారు. సోషల్ మీడియాలో పరిచయం లేనివారితో చాటింగ్ చేసేటప్పుడు, ముఖ్యంగా వ్యక్తిగత వివరాలు, ఫోటోలు పంచుకునేటప్పుడు అత్యంత అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఒకవేళ ఎవరైనా ఇలాంటి సైబర్ నేరాలు లేదా బ్లాక్‌మెయిల్‌కు గురైతే భయపడకుండా వెంటనే పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేయాలని సూచించారు.

రాజారాంపల్లిలో యువకుడి దారుణ హత్య

ముద్ర, జగిత్యాల : జగిత్యాల జిల్లా ఎండపల్లి మండలం రాజారాంపల్లిలో బొంత సంతోష్ (19) అనే యువకుడు దారుణ హత్యకు గురయ్యాడు. ఆదివారం రాత్రి పాత కక్షల నేపథ్యంలో శివరాత్రి అనిల్ అనే యువకుడు.. సంతోష్‌పై కత్తితో దాడికి పాల్పడినట్లు సమాచారం. తీవ్రంగా గాయపడిన యువకుడిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గంమధ్యలో మృతి చెందాడు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. దీనికి సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.



రూ.16 కోట్ల చిట్టీల మోసం.. ప్రధాన నిందితురాలు సీత అరెస్ట్

రూ.16 కోట్లకు పైగా మోసం జరిగినట్లు అంచనా
45 మంది బాధితులు.. ప్రధాన నిందితురాలు అరెస్ట్
HMT హిల్స్ కేంద్రంగా చిట్టీల దందా
ఆర్థిక లావాదేవీలపై పోలీసుల దర్యాప్తు



ముద్ర, హైదరాబాద్ : హైదరాబాద్‌లోని కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డ్ (KPHB) ప్రాంతంలో భారీ చిట్ ఫండ్ మోసం వెలుగులోకి వచ్చింది. అమాయక ప్రజల కష్టార్జితాన్ని ఆశ చూపించి టోకరా వేసిన ఘరానా మోసం తాజాగా పోలీసుల దర్యాప్తులో బట్టబయలైంది. ఈ చిట్ ఫండ్ కుంభకోణం సుమారు రూ. 16 కోట్లకు పైగా ఉంటుందని అంచనా వేస్తున్నారు. కేవలం తక్కువ కాలంలోనే ఎక్కువ లాభాలు వస్తాయన్న నమ్మకంతో సుమారు 45 మంది పెట్టుబడిదారులు ఈ ముఠా చేతిలో మోసపోయినట్లు సమాచారం.

నివాస ప్రాంతంలోనే దందాలు.. ప్రధాన నిందితురాలు అరెస్ట్

ఈ కేసులో ప్రధాన నిందితురాలిగా భావిస్తున్న సీత (కొన్ని నివేదికలలో సీతమ్మగా గుర్తింపు)ను పోలీసులు ఎట్టకేలకు అరెస్టు చేశారు. ఆమెతో పాటు ఆమె కుటుంబ సభ్యులు (రామనా రెడ్డి తదితరులు) కలిసి ఈ చిట్ ఫండ్ వ్యాపారాన్ని గుట్టుగా నిర్వహించినట్లు విచారణలో తేలింది. నిందితులు KPHB పరిధిలోని HMT హిల్స్ ప్రాంతంలో నివాసం ఉంటూ స్థానికంగా చాలా కాలంగా చిట్ ఫండ్ స్కీమ్‌లను నడుపుతున్నారు. నమ్మకం కలిగించేలా ప్రవర్తిస్తూ పెద్ద మొత్తంలో డిపాజిట్లు, పెట్టుబడులు సేకరించిన ఈ ముఠా.. ఆ తర్వాత చేతులు ఎత్తేసింది. బాధితులు తమ డబ్బులు తిరిగి ఇవ్వాలని కోరినప్పటికీ నిందితులు స్పందించకపోవడంతో మోసపోయినట్లు గ్రహించి పోలీసులను ఆశ్రయించారు.

కేసు నమోదు చేసి దర్యాప్తు ముమ్మరం చేసిన పోలీసులు

బాధితుల ఫిర్యాదు మేరకు అప్రమత్తమైన స్థానిక పోలీసులు వెంటనే కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ కుంభకోణంలో ప్రధాన నిందితులను ఇప్పటికే అదుపులోకి తీసుకున్న పోలీసులు, వారి ఆర్థిక లావాదేవీలపై లోతుగా విచారణ కొనసాగిస్తున్నారు. ఈ చిట్ ఫండ్ దందాలో ఇంకా ఎవరెవరి ప్రమేయం ఉందనే కోణంలో ఆరా తీస్తున్నారు. నగరంలో పెరుగుతున్న ఇలాంటి అనధికారిక చిట్ ఫండ్ల మోసాల పట్ల ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని, అధిక వడ్డీలు లేదా లాభాల ఆశ చూపే అసాధారణ పథకాలను నమ్మి మోసపోవద్దని అధికారులు హెచ్చరిస్తున్నారు.

చెడుపై ఎప్పటికైనా విజయం 'మంచి'కే

విజయ దశమి పర్వదినమే నిదర్శనం
కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్
హిందు బంధువులందరికీ దసరా శుభాకాంక్షలు చెప్పిన కేంద్ర మంత్రి



ముద్ర, హైదరాబాద్ : చెడు చేసే వారికి ఎన్నటికీ విజయం వరించదని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. ఎన్నటికైనా చెడుపై విజయం సాధించేది 'మంచి' మాత్రమేనని పునరుద్ఘాటించారు. పొరపాటున చెడు చేసే వారు ఇకనైనా ప్రవర్తనను మార్చుకుని ఇతరులకు సేవ చేయాలని, అలాంటి వారిపట్ల మాత్రమే అమ్మవారి కరుణా కటాక్షం ఉంటుందని చెప్పారు. మహిషాశుర మర్దిని చరిత్ర కూడా అదే చెబుతుందని తెలిపారు. దేవీ నవరాత్రి ఉత్సవాల చివరి రోజైన సోమవారం కరీంనగర్ మహాశక్తి ఆలయంలో అమ్మవారు మహిషాశుర వర్ధిని అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయంలో 'చండీ యాగం' పేరిట నిర్వహించిన హోమంలో పాల్గొన్నారు. అనంతరం భవానీ దీక్షను విరమించారు. సాయంత్రం 7.30 గంటలకు మహాశక్తి ఆలయంలో నిర్వహించిన రావణ దహనంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మీడియాతో మాట్లాడుతూ ఏమన్నారంటే....

హిందు బంధువులందరికీ విజయ దశమి శుభాకాంక్షలు. దేశవ్యాప్తంగా, తెలంగాణ, తెలుగు రాష్ట్రాల్లో గల్లీగల్లీలో దేవీ నవరాత్రి ఉత్సవాలు నిర్వహించుకున్నాం. చిన్ని పిల్లలు సైతం అమ్మవారికి పూజలు చేశారు. కరీంనగర్ మహాశక్తి ఆలయంలో దేవీ నవరాత్ర ఉత్సవాలు ఘనంగా జరిగాయి. వేలాది మంది భక్తులు దీక్షలు ఇక్కడే చేపట్టారు. అమ్మవారిని మొక్కుకుంటే కోరిన కోర్కెలు తీరుతాయనే నమ్మకం భక్తుల్లో ఏర్పడింది. దేశంలోనే కాదు, విదేశాల్లోని తెలుగు కుటుంబాలు సైతం పెద్ద ఎత్తున దేవీ నవరాత్రి ఉత్సవాలు నిర్వహించారు.చెడుపై మంచి సాధించిన విజయానికి గుర్తుగా విజయ దశమి పర్వదినంగా జరుపుకుంటున్నాం. పొరపాటున చెడు చేస్తే ప్రవర్తన మార్చుకుని ఇతరులకు సేవ చేస్తే అమ్మవారి కరుణా కటాక్షం ఉంటుంది. చెడు ఎప్పుడు విజయం సాధించదు. అధర్మానికి చోటు లేదు. మహిషాశుర మర్దిని చరిత్ర కూడా అదే చెబుతుంది.

సమ్మెకు ఈపీఎస్సీ బస్సు డ్రైవర్ల సిద్ధం!

సమ్మె సన్నాహాలు పూర్తి.. డిమాండ్ల సాధనకు కార్మికుల పట్టు





ముద్ర కరీంనగర్: కరీంనగర్ జిల్లా 2 డిపో లో సమ్మె సన్నద్ధతలో భాగంగా ఆర్టీసీ ఎలక్ట్రికల్ బస్ డ్రైవర్లు సమ్మెకు సిద్ధమవుతున్నారు. ఈ నెల 23వ తేదీ నుంచి యూనియన్ నాయకులతో చర్చించి సమ్మెలో పాల్గొనాలని నిర్ణయించినట్లు సమాచారం. డిమాండ్లు బీహెచ్ఎంఎస్ మని హెచ్చరికలు జారీ చేసినట్లు కథనంలో పేర్కొన్నారు.

ఈ మేరకు శనివారం కరీంనగర్ డిపో-2 కార్యాలయంలో ఈవీ సర్వీస్ ఏజెన్సీ చైర్మన్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డ్రైవర్ల సమస్యలు, సమ్మెకు సంబంధించిన అంశాలపై చర్చించారు.

ఈవీ బస్సుల సర్వీస్ ఏజెన్సీగా ఉన్న సంస్థలో 264 మంది డ్రైవర్లకు నిబంధనల ప్రకారం వేతనాలు చెల్లించడం లేదని, డ్రైవర్లను డ్యూటీ పేరుతో ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. ఏడాదికి రెండు యూనిఫాంలు, దీపావళికి బోనస్, డ్రైవర్‌కు బస్ సాకర్యం, ప్రతి నెల ఏడో తేదీలోగా జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

అలాగే నైట్ డ్యూటీ చేసిన డ్రైవర్లకు బెడ్ సాకర్యం, టీఎం కమిషన్, బస్ ట్రాక్ డౌన్ అయితే మరో బస్సు, పీఎఫ్, ఈఎస్ఐ సేవలు కల్పించాలని కోరారు. డ్రైవర్ డ్యూటీకి సంబంధించిన సమస్యలను పరిష్కరించాలని, డిమాండ్లు నెరవేర్చకపోతే సమ్మెకు దిగుతామని హెచ్చరించారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
మంగళవారం 20.10.2026
www.mudranews.in | @mudranews

దసరా వేళ గుమ్మడికాయల వ్యాపారం జోరు



దసరా పండుగ రాకతో పూలు, పూజా సామగ్రితో పాటు గుమ్మడికాయలకు కూడా భారీగా డిమాండ్ పెరుగుతుంది. ఇళ్లు, దుకాణాలు, వాహనాల వద్ద దిష్టి తీసేందుకు వీటిని కొనుగోలు చేస్తుంటారు. వరంగల్‌లో దసరా సందర్భంగా సుమారు రూ.కోటి మేర గుమ్మడికాయల వ్యాపారం జరుగుతుందని కథనంలో పేర్కొన్నారు.

ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి

ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి : ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను పెండింగ్ లేకుండా సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు,రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకా రెడ్డి తో కలిసి వివిధ ప్రాంతాల ప్రజల నుండి వచ్చిన 16 అర్జీలను స్వీకరించారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను సంబంధిత అధికారులు పెండింగ్ లేకుండా ఎప్పటి కప్పుడు క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలన్నారు. అందులో రెవిన్యూ శాఖ 10, హౌసింగ్ 2, పంచాయతీ, ఇరిగేషన్, పౌర సరఫరా లు, సర్వే ల్యాండ్స్ శాఖలకు ఒక్కొకటి చొప్పున వచ్చాయన్నారు. ప్రజావాణి లో వచ్చిన దరఖాస్తులు క్షేత్రస్థాయిలో పరిశీలించి పెండింగ్ లేకుండా ఎప్పటికపుడు డిస్పోస్ చేయాలని



ఆదేశించారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణా అభివృద్ధి అధికారి నాగిరెడ్డి , జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ప్రజావాణికి 25 దరఖాస్తులు

ముద్ర, సూర్యాపేట, అక్టోబర్ 19: ప్రజావాణిలో అందిన దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచకుండా నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ బి. హరిసింగ్ అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి అనంతరం జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రజావాణి కార్యక్రమానికి అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. జిల్లా, మండల స్థాయిలో అందే ప్రతి దరఖాస్తును ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేయాలని సూచించారు. రాష్ట్ర ప్రజావాణితో పాటు జిల్లా స్థాయిలో పెండింగ్‌లో ఉన్న అర్జీలను యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలని ఆదేశించారు.ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణికి జిల్లా స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలన్నారు. మండల స్థాయిలోనే సమస్యలు పరిష్కారమైతే ప్రజలకు ఇబ్బందులు తగ్గుతాయని పేర్కొన్నారు. కాగా, సోమవారం ప్రజావాణికి మొత్తం 25 దరఖాస్తులు అందాయి. వీటిలో భూ సమస్యలకు సంబంధించి 12, రెవెన్యూ శాఖకు ఒకటి, జిల్లా పంచాయతీ శాఖకు రెండు, విద్యాశాఖకు రెండు, ఇతర శాఖలకు సంబంధించి ఎనిమిది దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. వాటిని పరిష్కారం కోసం సంబంధిత శాఖలకు పంపించినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో డీఆర్వో ప్రేమ్‌రాజ్, డీఆర్‌డీవో పీడీ సన్యాసయ్య, సీపీవో కిషన్, డీఎంహెచ్‌వో వెంకటరమణ, జిల్లా వ్యవసాయాధికారి శ్రీధర్‌రెడ్డి, జిల్లా క్రీడలు, యువజన సంక్షేమ అధికారి వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపుల్లో అక్రమాలపై ఐక్య పోరు

22న ఖమ్మం కలెక్టరేట్ ఎదుట ధర్నా
వామపక్షాలు, బీఆర్ఎస్ నేతల పిలుపు



ముద్ర, ఖమ్మం, అక్టోబర్ 19: ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపుల్లో భారీగా అక్రమాలు, రాజకీయ వివక్ష జరుగుతున్నాయని ఆరోపిస్తూ ఐదు వామపక్ష పార్టీలు, బీఆర్ఎస్ సంయుక్త పోరాటానికి సిద్ధమయ్యాయి. అర్హులైన పేదలందరికీ ఇళ్లు కేటాయించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 22న ఖమ్మం కలెక్టరేట్ ఎదుట భారీ ధర్నా నిర్వహించనున్నట్లు ప్రకటించాయి. సోమవారం సుందరయ్య భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, సీపీఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధు, సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి సీవై పుల్లయ్య, న్యూడెమోక్రసీ నాయకుడు బండారి ఐలయ్య మాట్లాడారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆరు గ్యారెంటీల అమలును విస్మరించిందని విమర్శించారు. నియోజకవర్గానికి 3,500 ఇళ్లు మంజూరు చేస్తున్నామని చెబుతున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో అధికార పార్టీ నాయకులు సూచించిన వారికే ప్రాధాన్యం ఇస్తున్నారని ఆరోపించారు. గ్రామసభలను పక్కనపెట్టి ఇందిరమ్మ కమిటీల పేరుతో లబ్ధిదారులను ఏకపక్షంగా ఎంపిక చేస్తున్నారని మండిపడ్డారు. ఇది పంచాయతీరాజ్ స్ఫూర్తికి విరుద్ధమన్నారు.గత ప్రభుత్వ హయాంలో ఇళ్ల నిర్మాణం ప్రారంభించిన పేదలకు నిధులు విడుదల చేయడం లేదని విమర్శించారు. రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ ఇళ్లు కేటాయించాలని, గ్రామసభలు లేదా పారదర్శకమైన లాటరీ విధానం ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకుంటే ప్రజాపోరాటాలతో పాటు న్యాయపోరాటం చేపడతామని హెచ్చరించారు. ఈ నెల 22న జరిగే ధర్నాకు ప్రజాప్రతినిధులు, బాధితులు, పేదలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు.సమావేశంలో సీపీఎం నాయకులు బండి రమేష్, మాదినేని రమేష్, సీపీఐ నాయకుడు యర్రా బాబు, న్యూడెమోక్రసీ నాయకుడు లక్ష్మీనారాయణ, మాస్‌లైన్ నాయకులు అశోక్, శ్రీనివాస్, సర్పంచ్‌లు ఆవుల నర్సింహారావు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

దసరా శుభాకాంక్షలు తెలిపిన డీసీసీ అధ్యక్షుడు


ముద్ర ప్రతినిధి, ఖమ్మం, అక్టోబరు 19 : దుర్గాష్టమి, విజయదశమి పండుగ శుభ సమయాన్ని పురస్కరించుకుని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ జిల్లా ప్రజలకు, కాంగ్రెస్ నాయకులకు, కార్యకర్తలకు, అభిమానులకు హృదయపూర్వక పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ, ముఖ్యంగా జిల్లాలోని ఆడపడుచులందరికీ ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేశారు.తెలంగాణ సాంస్కృతిక వైభవానికి నిదర్శనమైన బతుకమ్మ పండుగ కేవలం పూల పండుగ మాత్రమే కాదని, ఇది తెలంగాణ ప్రజల ఆత్మగౌరవానికి, జీవన విధానానికి ప్రతిరూపమని ఆయన పేర్కొన్నారు. ప్రకృతి ప్రసాదించిన రకరకాల రంగురంగుల పూలు, వాటి సువాసనలతో మహిళలంతా కలిసికట్టుగా, ఎంతో సంతోషంగా జరుపుకునే విశిష్టమైన పండుగ ఇది అని కొనియాడారు. సకల జనులను, అన్ని వర్గాల ప్రజలను ఒకే వేదికపైకి చేర్చి సామాజిక న్యాయానికి, సమానత్వానికి, సామరస్యానికి ప్రతీకగా నిలిచే ఈ బతుకమ్మ వేడుకలు ప్రతి ఇంటా సంతోషాలను నింపాలని ఆకాంక్షించారు. విజయదశమి పండుగ జిల్లా ప్రజలందరి జీవితాల్లో వెలుగులు నింపి, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలు ప్రసాదించాలని నూతి సత్యనారాయణ గౌడ్ ఈ సందర్భంగా ఆశాభావం వ్యక్తం చేశారు.



విజయాల దిశగా పయనించే స్ఫూర్తి దసరా

మాజీ మంత్రి పువ్వాడ

ముద్ర ప్రతినిధి, ఖమ్మం, అక్టోబరు 19 : విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రజలందరికీ మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ హృదయపూర్వక దసరా శుభాకాంక్షలు తెలిపారు. తొమ్మిది రోజుల పాటు అత్యంత వైభవంగా సాగిన బతుకమ్మ సంబురాలతోపాటు దేవీ శరన్నవరాత్రుల దుర్గమ్మ పూజల పర్వదినాలకు కొనసాగింపుగా జరుపుకునే విజయదశమికి తెలంగాణ ప్రజా జీవనంలో అత్యంత విశిష్టమైన స్థానం ఉందని ఆయన పేర్కొన్నారు.కార్యదీక్షతో పనిచేసే వారిని అపజయాల నుంచి విజయాల వైపు నడిపిస్తూ, ఏనాటికైనా ధర్మానిదే అసలు విజయం అనే గొప్ప స్ఫూర్తిని ఈ పండుగ మనకు అందిస్తుందని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర సాధన పోరాటంలోనూ బతుకమ్మతో పాటు విజయదశమి అందించిన స్ఫూర్తి ఎంతగానో ఇమిడి ఉందన్నారు. అదే ఉత్తేజంతో బిఆర్ఎస్ పాలనలో ప్రజలను ఎల్లప్పుడూ విజయాల దిశగానే ముందుకు నడిపించామని ఆయన గుర్తుచేశారు.రాష్ట్ర ప్రజల జీవితాలు గెలుపు దిశగా పయనించాలని ఆకాంక్షిస్తూ, ప్రజలందరి జీవితాల్లో సుఖ సంతోషాలు, నిత్య శుభాలు నిండేలా దీవించాలని ఆ కనకదుర్గమ్మ తల్లిని పువ్వాడ అజయ్ కుమార్ వేడుకున్నారు.



అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు

మంత్రి పొంగులేటి

ముద్ర ప్రతినిధి, ఖమ్మం, అక్టోబరు 19 : రాష్ట్రంలో అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు అందజేస్తామని రాష్ట్ర రెవెన్యూ శాఖమంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. కూసుమంచి క్యాంప్ కార్యాలయంలో రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాలను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ప్రభుత్వాల్లా మాటలతో మోసం చేయకుండా, పారదర్శకంగా పేదల సొంత ఇంటి కల నెరవేర్చడమే తమ ప్రభుత్వ ధ్యేయమని పేర్కొన్నారు.రాష్ట్ర వ్యాప్తంగా మొదటి విడతలో 4.5 లక్షలు, రెండో విడతలో 2.5 లక్షలు, హైదరాబాద్‌లో లక్ష ఇళ్లతో పాటు టవర్స్ నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. ఇప్పటి వరకు 2.40 లక్షల ఇళ్ల నిర్మాణం పూర్తయిందని, దీనికోసం రూ.40 వేల కోట్లు ఖర్చు చేశామని వివరించారు. రాబోయే 3, 4 విడతల్లోనూ అర్హులందరికీ ఇళ్లు కట్టిస్తామని ధీమా వ్యక్తం చేశారు.



కులమతాలు, రాజకీయాలకు అతీతంగా ప్రతిపక్ష నియోజకవర్గాల్లోనూ ఇళ్లను కేటాయిస్తున్నామని వెల్లడించారు.ఆర్థిక పరిస్థితులు ఎలా ఉన్నా సంక్షేమ పథకాలు ఆగేదీ లేదని మంత్రి స్పష్టం చేశారు. ఇప్పటికే 73 వేల ఉద్యోగాలు ఇచ్చామని, మరో 14 వేల పోస్టులకు నోటిఫికేషన్ ఇచ్చామని తెలిపారు. సన్నబియ్యం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రైతు రుణమాఫీ, మహిళా సంఘాలకు సున్నా వడ్డీ రుణాలు విజయవంతంగా అమలు చేస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి, హౌజింగ్ పీడీ భూక్యా శ్రీనివాస్, ఎంపీడీవో జశ్వంత్ కుమార్, తహశీల్దార్ సైదులు తదితరులు పాల్గొన్నారు.

నీటిని పొదుపుగా వాడుకోవాలి

మంత్రి తుమ్మల

ముద్ర ప్రతినిధి, ఖమ్మం, అక్టోబరు 19 : ఈర్లపూడి చెరువును రాష్ట్ర వ్యవసాయ శాఖమంత్రి తుమ్మల నాగేశ్వర రావు క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. నాగార్జున సాగర్ జలాల ఆధారంగా మంచుకొండ లిఫ్ట్ ద్వారా నీటిని విడుదల చేసి ఈర్లపూడి చెరువును నింపినట్లు ఆయన తెలిపారు.ప్రస్తుతం ఎల్నినో ప్రభావం తీవ్రంగా ఉన్నందున రాబోయే రోజుల్లో ఎండల తీవ్రత పెరిగే అవకాశం ఉందని, సమీప కాలంలో వర్షాలు పడే సూచనలు తక్కువగా ఉన్నాయని మంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. అందువల్ల ప్రతి ఒక్కరూ నీటిని ఎంతో జాగ్రత్తగా, పొదుపుగా వినియోగించుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. చెరువులోని నీటిని తాగునీటి అవసరాలకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తూ వాడుకోవాలని స్పష్టం చేశారు.రైతులు నీటి అవసరం చాలా తక్కువగా ఉండే ఆరుతడి పంటలను మాత్రమే సాగు చేయాలని, వరి, మొక్కజొన్న లాంటి ఎక్కువ నీరు అవసరమయ్యే పంటలను సాగు చేయవద్దని సూచించారు. ఉష్ణోగ్రతలు పెరగడంతో పాటు నీరు, కరెంటు కొరత ఏర్పడే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ప్రజలకు, పశుపక్ష్యాదులకు తాగునీరు ఎంతో ముఖ్యమని పేర్కొంటూ, నీటితో పాటు విద్యుత్‌ను కూడా పొదుపుగా వాడుకోవాలని మంత్రి తుమ్మల నాగేశ్వర రావు పిలుపునిచ్చారు.ఈ పర్యటనలో సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ మాజీ చైర్మన్ రాయల



నాగేశ్వర రావు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

వెలుగుమట్ల కాలనీ ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలి

వెలుగుమట్ల కాలనీలో నిర్మిస్తున్న 300 ఇందిరమ్మ ఇళ్లతో పాటు అన్ని మౌలిక వసతుల పనులను నవంబర్ 15 నాటికి నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్‌తో కలిసి కాలనీని పరిశీలించిన అనంతరం ఆయన మీడియా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అక్టోబర్ నెలాఖరులోగా అన్ని ఇళ్ల స్లాబుల నిర్మాణం పూర్తి చేయాలని, నవంబర్ 8 నాటికి సోలార్ రూఫ్‌టాప్ ప్యానెళ్ల ఏర్పాటు పూర్తి కావాలని స్పష్టం చేశారు. రహదారులు, డ్రైనేజీలు, షాపింగ్ కాంప్లెక్స్, బస్టీ దవాఖానా, కమ్యూనిటీ హాల్, అంగన్‌వాడీ కేంద్రం వంటి అన్ని వసతులను సమాంతరంగా అభివృద్ధి చేయాలన్నారు. పనుల పురోగతిపై ప్రతి మూడు రోజులకు ఒకసారి నివేదిక అందించాలని అధికారులను ఆదేశించారు. పేదల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని, డిసెంబర్ 9న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ఆదర్శవంతమైన కాలనీని ప్రారంభించనున్నట్లు మంత్రి వెల్లడించారు. కార్యక్రమంలో సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య పాల్గొన్నారు.

ప్రజా పాలన పేరుతో కాంగ్రెస్ అసమర్థ పాలన

బీజేపీ కిసాన్ మోర్చా ధ్వజం



ముద్ర ప్రతినిధి,ఖమ్మం, అక్టోబరు 19 : ఎన్నికల ముందు ఎన్నో హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు అస్తవ్యస్త, అసమర్థత, నిర్లక్ష్య పాలనను అందిస్తోందని బీజేపీ ఖమ్మం జిల్లా కిసాన్ మోర్చా నాయకులు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. భారతీయ జనతా పార్టీ, కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో ఎస్సీ విద్యుత్ కార్యాలయం వద్ద నిరసన ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వరరావు, రాష్ట్ర కోశాధికారి దేవకి వాసుదేవరావు, ప్రధాన కార్యదర్శి గుత్తా వెంకటేశ్వరరావు, కిసాన్ మోర్చా అధ్యక్షులు నరకుల్ల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సాగు నీరు, నాణ్యమైన విద్యుత్ సరఫరా లేక పంటలు ఎండిపోతున్నాయని రైతులు ఆవేదన చెందుతున్నారన్నారు. గోదావరి జలాలు పుష్కలంగా ఉన్నప్పటికీ సీతారామ ప్రాజెక్టును పూర్తిస్థాయిలో వినియోగించకపోవడం ప్రభుత్వ వైఫల్యమేనని విమర్శించారు. రాష్ట్రంలో ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజనను సమర్థవంతంగా అమలు చేయడంలో కాంగ్రెస్ విఫలమైందని ఆరోపించారు.అనంతరం విద్యుత్ శాఖ సూపరింటెండింగ్ ఇంజనీర్ కి వినతిపత్రం సమర్పించి, వ్యవసాయానికి నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్ అందించాలని కోరారు. రైతుల సమస్యలను తక్షణమే పరిష్కరించకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. నాయకులు చిలుకూరి రమేష్, మందడపు సుబ్బారావు, తెప్పాల లక్ష్మీ రెడ్డి పాల్గొన్నారు.

ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులను తక్షణమే క్రమబద్ధీకరించాలి

బీజేపీ రాష్ట్ర కోశాధికారి దేవకి వాసుదేవరావు



ముద్ర ప్రతినిధి, ఖమ్మం, అక్టోబరు 19 : రాష్ట్రవ్యాప్తంగా సేవలందిస్తున్న 17 వేల మంది నేషనల్ హెల్త్ మిషన్ ఉద్యోగులను తక్షణమే క్రమబద్ధీకరించాలని బీజేపీ రాష్ట్ర కోశాధికారి దేవకి వాసుదేవరావు డిమాండ్ చేశారు. కలెక్టరేట్ వద్ద నిరవధిక ధర్నా నిర్వహిస్తున్న ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల శిబిరాన్ని సందర్శించి ఆయన సంపూర్ణ సంఘీభావం తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్‌హెచ్‌ఎం నిధుల్లో కేంద్ర ప్రభుత్వం తన 60 శాతం వాటాను సకాలంలో ఇస్తున్నప్పటికీ, రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం తన 40 శాతం వాటాను విడుదల చేయకుండా జాప్యం చేస్తోందని విమర్శించారు. ఎన్నికల సమయంలో ఉద్యోగులను రెగ్యులరైజ్ చేస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ నాయకులు, అధికారంలోకి వచ్చాక మాట తప్పడం సరికాదన్నారు. జీవో 1195 పై పునఃసమీక్ష జరిపి ఉద్యోగులకు నష్టం కలగకుండా వేతనాలు, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. ప్రాణాలకు తెగించి కరోనా సమయంలో సేవలు అందించిన వైద్య సిబ్బందికి న్యాయం జరిగే వరకు బిజెపి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల ప్రతినిధులు పాల్గొన్నారు.

నియోజకవర్గ ప్రజలకు దసరా శుభాకాంక్షలు

పీఏసీగా చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ



ముద్ర, శేరిలింగంపల్లి : శేరిలింగంపల్లి నియోజకవర్గ సమస్త ప్రజలకు, తాజా మాజీ కార్పొరేటర్లకు, ప్రజాప్రతినిధులకు, నాయకులకు, కార్యకర్తలకు, పాత్రికేయ మిత్రులకు, అభిమానులకు, శ్రేయబిలాషులకు, దసరా పర్వదినం శుభాకాంక్షలు తెలియచేసిన పీఏసీగా చైర్మన్ ఆరెకపూడి గాంధీ. ఈ సందర్భం చైర్మన్ గాంధీ మాట్లాడుతూ చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా జరుపుకునే పావన పర్వదినమే దసరా పండుగ లేదా విజయదశమి అని పిలుస్తారు అని చైర్మన్ గాంధీ తెలియచేశారు. శ్రీదేవి నవరాత్రుల శుభవేళ జగన్మాత దివ్య ఆశీస్సుల ప్రసాదించి మన జీవితాల్లోని చీకట్లను తొలగిస్తారని, అమ్మ వారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని, అంతా మంచే జరగాలని కోరుకుంటున్నానని చైర్మన్ గాంధీ తెలియచేశారు. విజయదశమి రోజున చరిత్ర ప్రకారం రాముడు రావణుని పై గెలిచిన సందర్భం, పాండవులు వనవాసం వెళ్తూ జమ్మి చెట్టు పై తమ ఆయుధాలను తిరిగి తీసిన రోజు అని గుర్తు చేశారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
మంగళవారం 20.10.2026
www.mudranews.in | @mudranews


ఒక్క గుమ్మడికాయ.. 100 మేకలతో సమానమా?



దసరా పండుగ వేళ గుమ్మడికాయ కొట్టడం వెనుక ప్రత్యేకమైన నమ్మకం ఉంది. ఒక్క గుమ్మడికాయను కొడితే వంద మేకలను బలి ఇచ్చినంత ఫలితం ఉంటుందని కొందరు విశ్వసిస్తారు. అయితే ఇది సంప్రదాయ విశ్వాసం మాత్రమేనని, దీనికి శాస్త్రీయ ఆధారాలు లేవని నిపుణులు చెబుతున్నారు.

మహిషాసురమర్ధినిగా అమ్మవారు







శ్రీదేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం శ్రీ మహిషాసురమర్ధిని(సిద్ధిదాత్రి) దేవి రూపంలో శ్రీ ఏడుపాయల వనదుర్గాభవాని అమ్మవారు భక్తులకు దర్శనం ఇచ్చారు. అమ్మవారి దర్శనానికి ఉదయం నుండి పోటెత్తారు. మెదక్ కాళికాదేవి ఆలయం, రేణుకాదేవి ఆలయం, పట్టణంలో నెలకొల్పిన మండపాలలో అమావారిని భక్తులు దర్శించుకున్నారు. పేరూరు సరస్వతి మాత ఆలయంలో నవరాత్రి ఉత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. హవెలి ఘనపూర్ మండలం జక్కన్నపేటలో అమ్మవారికి విశేష పూజలు జరిగాయి. - ముద్ర ప్రతినిధి, మెదక్

చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీక దసరా

ప్రజలందరికీ దసరా శుభాకాంక్షలు తెలిపిన మంత్రి తుమ్మల



ముద్ర ప్రతినిధి, ఖమ్మం, అక్టోబరు 19 : తెలంగాణ రాష్ట్రంలోని ప్రజలందరికీ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విజయదశమి పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు. పవిత్రమైన నవరాత్రి ఉత్సవాల ముగింపుగా, అధర్మంపై ధర్మం, చెడుపై మంచి సాధించిన మహోన్నత విజయానికి ప్రతీకగా విజయదశమి పండుగ నిలుస్తుందన్నారు. దైవిక శక్తి ముంగిట ఆసురీ శక్తులు తలవంచిన పవిత్ర తరుణమిదని, మహిషాసుర మర్దినిగా అమ్మవారు జగత్తును కాపాడినట్లే, ప్రతి ఒక్కరి జీవితాల్లోని అజ్ఞానమనే చీకట్లు తొలగి జ్ఞాన కాంతులు వికసించాలని ఆకాంక్షించారు.తెలుగు ప్రజలందరూ ఈ విజయ దశమి వేడుకలను అత్యంత భక్తిశ్రద్ధలతో, ఆనందోత్సాహాల నడుమ ఘనంగా జరుపుకోవాలని పిలుపునిచ్చారు. దుర్గాదేవి దివ్య ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలందరికీ సర్వదా విజయాలు, సుఖసంతోషాలు, సకల ఐశ్వర్యాలు కలగాలని, ప్రతి ఇంట ఆనంద నిలయాలు వెలసిల్లాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు.

టీజీపీఎస్సీ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

కలెక్టర్ ప్రతిమా సింగ్



ముద్ర ప్రతినిధి, మెదక్: తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీ.జీ.పీ.ఎస్.సీ) ఆధ్వర్యంలో ఈ నెల 24న నిర్వహించనున్న కంప్యూటర్ ఆధారిత పరీక్షలకు (సీబీటీ) పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు కలెక్టర్ ప్రతిమా సింగ్ తెలిపారు. కాలుష్య నియంత్రణ మండలిలో అసిస్టెంట్ సైంటిస్ట్ (అనలిస్ట్ గ్రేడ్-II), అసిస్టెంట్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ పోస్టుల భర్తీకి సంబంధించి పరీక్షల నిర్వహణపై టీ.జీ.పీ.ఎస్.సీ చైర్మన్ బుర్రా వెంకటేశం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. పరీక్షల నిర్వహణకు చేపట్టిన ఏర్పాట్లను సమీక్షించి పలు సూచనలు చేశారు. కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ...మెదక్ జిల్లాలోని నర్సాపూర్ బీవీఆర్ఐటీలో పరీక్షా కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ నెల 24న అసిస్టెంట్ సైంటిస్ట్ (అనలిస్ట్ గ్రేడ్-II) పోస్టులకు సంబంధించి రెండు సెషన్లలో పరీక్షలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. మొదటి సెషన్ ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, రెండో సెషన్ మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉంటుందని తెలిపారు. జిల్లాలో ఈ పరీక్షలకు మొత్తం 200 మంది అభ్యర్థులు హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. అభ్యర్థులు నిర్దిష్ట సమయానికి ముందుగానే పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని కలెక్టర్ సూచించారు. మొదటి సెషన్‌కు ఉదయం 8.30 గంటల నుంచి పరీక్షా కేంద్రంలోకి అనుమతిస్తారని, ఉదయం 9.30 గంటలకు గేట్లు మూసివేస్తారని తెలిపారు. రెండో సెషన్‌కు మధ్యాహ్నం 1 గంట నుంచి అనుమతిస్తారని, మధ్యాహ్నం 2 గంటలకు గేట్లు మూసివేస్తారని స్పష్టం చేశారు. అభ్యర్థులు ఈ సమయాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు.పరీక్షా కేంద్రంలోకి మొబైల్ ఫోన్లు, పుస్తకాలు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను తీసుకెళ్లేందుకు అనుమతి లేదని స్పష్టం చేశారు. పరీక్షా కేంద్రాల వద్ద క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించడంతో పాటు, కట్టుదిట్టమైన చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పరీక్షలను పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో సజావుగా నిర్వహించేందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు.ఏవో యూనస్, నర్సాపూర్ తహసిల్దార్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి దరఖాస్తులను పరిష్కరించాలి

అదనపు కలెక్టర్ నగేష్




ముద్ర ప్రతినిధి మెదక్: ప్రజావాణి దరఖాస్తులను తక్షణమే పరిష్కరించాలనీ అదనపు కలెక్టర్ నగేష్ అధికారులకు సూచించారు.సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా మెదక్ కలెక్టరేట్ కార్యాలయ సమావేశ మందిరంలో ప్రజల నుంచి పిర్యాదులను స్వీకరించారు. ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన దరఖాస్తులను తక్షణమే పరిశీలించి పరిష్కరించాలని, సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పి సీఈఓ ఎల్లయ్య, ఏవో యూనస్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

24న స్వర్ణకార శంఖారావం



ముద్ర ప్రతినిధి, మెదక్: స్వర్ణకార శంఖారావం పేరిట ఈనెల 24న జరిగే ఛలోహైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయంతం చేయాలని స్వర్ణకార సంఘం జిల్లా అధ్యక్షులు పూనా రవిచారి పిలుపునిచ్చారు. మెదక్ పట్టణంలో సోమవారం గోడ పత్రిక ఆవిష్కరణ చేశారు. రవిచారి మాట్లాడుతూ... వృత్తి పరిర క్షణకై భారీ బహిరంగ సభ ఉంటుందన్నారు. స్వర్ణకారులకు ప్రత్యేక కార్పోరేషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. జి.ఓ. నెం. 272ను సవరణ చేసి, అమలు పరిచి అక్రమ రికవరీలను అరికట్టాలన్నారు. 50సం: నిండిన స్వర్ణకార వృత్తి దారులకు 5 వేల రూపాయలు పెన్షన్ ఇవ్వాలని, అన్ని బ్యాంకుల ఆప్లిజర్లకు సమాంతర కమీషన్ ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి దామోదర్ చారి, రాష్ట్ర కార్యదర్శి నెల్లి శ్రీనివాస్ చారి, పట్టణ అధ్యక్షులు బ్రహ్మాచారి, కార్యదర్శి వేణుచారి, జూవెల్లరి అసోసియేషన్ అధ్యక్షులు రాచపల్లి శ్రీనివాస్ చారి, నాయకులు ఝాన్సీ లింగాపూర్ శ్రీనివాస్ చారి, సభ్యులు పాల్గొన్నారు.

విద్యుత్ రాష్ట్ర సలహా కమిటీ సభ్యుడిగా శశిధర్ రెడ్డి



ముద్ర ప్రతినిధి, మెదక్: విద్యుత్ నియంత్రణరాష్ట్ర సలహా కమిటీ సభ్యులుగా మెదక్ మాజీ ఎమ్మెల్యే పట్లోళ్ల శశిధర్ రెడ్డి తిరిగి నియామకమయ్యారు. రాష్ట్ర సలహా కమిటీని పునర్వ్యవస్థీకరణ చేస్తూ తాజాగా ఉత్తర్వులు ఇచ్చారు. 21 మంది సభ్యులతో రాష్ట్ర సలహా కమిటీని ప్రకటిస్తూ కమీషన్ కార్యదర్శి రాంచందర్ ఉత్తర్వులు జారీ చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఏఆర్ ఎస్ఐ ప్రసాద్ మృతి


ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు సంతాపం



ముద్ర ప్రతినిధి, మెదక్: విధులకు హాజరయ్యేందుకు వస్తూ రోడ్డు ప్రమాదంలో ఏఆర్ ఎస్ఐ ప్రసాద్ మృతి చెందారు. ఆదివారం సాయంత్రం హైదరాబాద్ నుంచి మెదక్‌కు వస్తున్న సమయంలో నర్సాపూర్-మెదక్ మార్గంలో ఆయన ప్రయాణిస్తున్న వాహనం స్కిడ్ కావడంతో తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే నర్సాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని యశోద ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో ప్రసాద్ మృతి చెందారు.ప్రసాద్ మృతి పోలీస్ శాఖకు తీరని లోటని ఎస్పీ శ్రీనివాస్ రావు పేర్కొన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, ఈ విషాద సమయంలో వారికి మనోధైర్యం కలగాలని ఆకాంక్షించారు. మృతుడి కుటుంబానికి పోలీస్ శాఖ అండగా ఉంటుందని తెలిపారు.

తెలంగాణ భవన్‌లో వైభవంగా బతుకమ్మ వేడుకలు





ముద్ర ప్రతినిధి, ఖమ్మం, అక్టోబరు 19 : తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే సద్దుల బతుకమ్మ వేడుకలు బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం 'తెలంగాణ భవన్'లో అంగరంగ వైభవంగా ముగిశాయి. ఎమ్మెల్సీ, జిల్లా పార్టీ అధ్యక్షుడు తాతా మధుసూదన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలకు 2 వేలమందికి పైగా మహిళలు హాజరై, బతుకమ్మలతో కోలాటాలు, ఆటపాటలతో ప్రాంగణాన్ని పండుగ శోభతో నింపేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు కందాల ఉపేందర్ రెడ్డి, సండ్ర వెంకట వీరయ్య, బానోతు చంద్రావతి తదితరులు పాల్గొని పూజలు నిర్వహించారు.మహిళలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా తెలంగాణ భవన్ ప్రాంగణంలోనే కృత్రిమ కోనేరు ఏర్పాటు చేసి బతుకమ్మల నిమజ్జనానికి వసతి కల్పించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. హాజరైన ప్రతి ఒక్కరికీ అన్నప్రసాదాలు అందించడంతో పాటు పాల్గొన్న మహిళలందరికీ ప్రత్యేక బహుమతులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తాతా మధుసూదన్ మహిళలకు సద్దుల బతుకమ్మ, దసరా, దీపావళి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు బీఆర్ఎస్ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా సద్దుల బతుకమ్మ వేడుకలు



ముద్ర దేవరకొండ: తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అయిన సద్దుల బతుకమ్మ పండుగను కొండమల్లేపల్లి మండలంలో ని వినాయక నగర్ 2 ఆడపడుచులు అత్యంత వైభవంగా జరుపుకున్నారు.రాష్ట్ర పండుగ అయిన బతుకమ్మ పండుగ చివరి రోజైన సద్దుల బతుకమ్మను పురస్కరించుకుని మహిళలు రంగురంగుల గునుగు, తంగేడు, బంతి పూలతో పెద్ద బతుకమ్మలను పేర్చారు. ఆనంతరం బతుకమ్మ చుట్టూ కోలాటాలు, బతుకమ్మ పాటలు పాడుతూ ఆటపాటలతో సందడి చేశారు.ఈ సందర్భంగా తెలంగాణ ఆడపడుచులందరికీ సద్దుల బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. బతుకమ్మ పండుగ ఆడబిడ్డల ఐక్యతకు, సంతోషానికి నిదర్శనమని పేర్కొన్నారు.ఈ వేడుకల్లో పెద్దలు మహిళలు, యువతులు, చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొని పండుగను విజయవంతం చేశారు.

కట్ట కొమ్ము తండాలో క్రికెట్ ప్రీమియర్ లీగ్

ముఖ్యఅతిథిగా శివా నాయక్



ముద్ర, దేవరకొండ: దేవరకొండ నియోజకవర్గం కట్ట కొమ్ము తండా గ్రామపంచాయతీ లో కార్తీక్ మరియు సురేష్ గార్ల జ్ఞాపకార్థం నిర్వహించిన క్రికెట్ ప్రీమియర్ లీగ్ కి తెలంగాణ రక్షణ సేన దేవరకొండ నియోజకవర్గం అసెంబ్లీ ఇన్చార్జి శివ నాయక్ ముఖ్యఅతిథిగా విచ్చేసి మొదటి బహుమతి గా 12000 నగదుతో పాటు షీల్డ్ ని బహకరించి యువతను సన్మార్గంలో నడిచే విధంగా క్రీడా స్ఫూర్తిని తీసుకొని జీవితంలో సన్మార్గంతో నడవాలని యువతను సూచించి వారికి స్ఫూర్తిని కలిగించడం జరిగింది . ఈ కార్యక్రమంలో తెలంగాణ రక్షణ సేన నియోజకవర్గ ఇన్చార్జి నేనావత్ శివ నాయక్ మరియు గ్రామ సర్పంచ్ ఉప సర్పంచ్ మాజీ సర్పంచ్ మరియు తెలంగాణ రక్షణ సేన ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

ఉరి తాళ్లతో ఎన్‌హెచ్ఎం ఉద్యోగుల నిరసన

ముద్ర, నాగర్‌కర్నూల్ : జాతీయ ఆరోగ్య మిషన్ పరిధిలో వివిధ క్యాడర్లలో పనిచేస్తున్న ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం నాగర్‌కర్నూల్ జిల్లాలో చేపట్టిన నిరవధిక సమ్మె సోమవారం ఏడో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఎన్‌హెచ్ఎం జేఏసీ ఆధ్వర్యంలో ఉద్యోగులు మెడలో ఉరితాళ్లతో వినూత్నంగా నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఉద్యోగులు మాట్లాడుతూ, ఎన్నో ఏళ్లుగా కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ విధానాల్లో పనిచేస్తూ ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్నప్పటికీ తమ సమస్యలు పరిష్కారం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా తమను ఆదుకోకపోతే తమకు ఉరి తాళ్లే దిక్కవుతాయని పేర్కొన్నారు. తమ పరిస్థితిని అర్థం చేసుకుని ముఖ్యమంత్రి, ఆరోగ్య శాఖ మంత్రి వెంటనే స్పందించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని, సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని, ఉద్యోగులకు ఎంప్లాయీస్ హెల్త్ స్కీమ్ (EHS) కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్‌హెచ్ఎం జేఏసీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ బాలకృష్ణ, ప్రధాన కార్యదర్శి దామగట్ల కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు గౌస్ పాషా, వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాసులు, కోశాధికారి ప్రవీణ్, సభ్యులు జగన్, రామకృష్ణ రెడ్డి, సురేష్, భీముడు పాల్గొన్నారు.

Printed, Published and owned by Aliminati Indra Reddy Printed at M/s. Kakatiya Printers, 2-24-96/6, Plot No. 26 & 27, L.N. Colony, New IDA, Uppal, Hyderabad500039, Medchal Malkajgiri Dist., Telangana and Published from H.No.7-32/B, Flat No. 202, Sri Sai Heights, Sri Sai Nagar, Street No. 8, Hasbiguda, Medchal Malkajgiri District, Hyderabad 500007, Editor: Y Narender Reddy, RNI. Reg.No.TELTEL/2013/50413. e mail: mudradaily@gmail.com, Cell 9949193555